శ్రద్ధాంజలి



కీ.శే. శ్రీమతి పురిటిపాటి విజయలక్ష్మి
(1951 – 05/10/2025)

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

సిటీ

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 65 | విజయవాడ, సోమవారం 6 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 6 October 2025 | Rs

శ్రద్ధాంజలి



కీ.శే. శ్రీమతి పురిటిపాటి విజయలక్ష్మి
(1951 – 05/10/2025)

శ్రద్ధాంజలి



కీ.శే. శ్రీమతి పురిటిపాటి విజయలక్ష్మి

(1951 – 05/10/2025)

ప్రేమకు ప్రతిరూపంగా.. ధైర్యానికి నిలువుటద్దంగా..
మా వెన్ను తట్టి నడిపించిన మీరు భౌతికంగా దూరమైనా..
మా హృదయాల్లో ఎప్పటికీ నిలిచే వుంటారు.

భర్త
పి. వీరా రెడ్డి

సోదరుడు
పి.పి. రెడ్డి - పి. రమ

కుమారులు
పి.వి. కృష్ణా రెడ్డి - పి. సుధారాణి
పి.వి. సుబ్బా రెడ్డి - పి. సుమలత

కుమార్తె
పి. ప్రసన్న కుమారి – పి. నాగి రెడ్డి

పెద్దకర్మ

2025 అక్టోబరు 15వ తేదీ
బుధవారం

స్థలం:
హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్,
హైదరాబాద్.

meil family

చర్చలు విఫలం

పిహెచ్‌సి వైద్యుల సమ్మె కొనసాగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులతో, ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల సంఘం (ఎపిపిహెచ్‌సిడిఎ) విజయవాడలో ఆదివారం జరిపిన చర్చలు విఫలమవడంతో సమ్మె యథావిధిగా కొనసాగుతుందని వైద్యుల సంఘం ప్రకటించింది. అధికారుల బృందంతో సంఘానికి చెందిన 15 మంది నాయకులు చర్చలు జరిపారు. అనంతరం ఎపి పిహెచ్‌సిడిఎ రాష్ట్ర అధ్యక్షులు బి రవీంద్ర నాయక్ విలేకరులతో మాట్లాడుతూ.. ఇన్ సర్వీస్ పిజి కోటా 15 నుంచి 20 శాతం అన్ని విభాగాల్లో ఐదేళ్లపాటు కొనసాగించాలని కోరగా, అధికారులు ఏడాది మాత్రమే కొనసాగిస్తామని, అనంతరం ఖాళీలను బట్టి కోటాను నిర్ణయిస్తామని చెబుతున్నారని తెలిపారు. గతంలోను ఇదే విధంగా హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న వైద్యుల్లో 20 ఏళ్లగా ఒక్క ఉద్యోగోన్నతి పొందని వైద్యులు ఉన్నారని, ఈ అంశంపై చర్చల్లో సరైన హామీ రాలేదని అన్నారు. పిహెచ్‌సి వైద్యుల రిలే దీక్షలు యథావిధిగా కొనసాగుతాయని, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.



దీక్ష చేపట్టిన వైద్యులు



ఆందోళన చేస్తున్న వైద్యులు

ఇన్ సర్వీసు కోటా అమలుకు ఖాళీ పోస్టులు లేవు

గత మూడేళ్లలో పిజి వైద్యులను అవసరానికంటే అధికంగా నియమించుకున్నట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. చర్చల అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఇన్ సర్వీసు కోటా ఏళ్ల తరబడి అమలుకు సాధ్యం కాదన్నారు. వైద్యులు కోరిన విధంగా 20 శాతం ఒక ఏడాదికి అమలు చేస్తామని చెప్పినా.. ఇందుకు అంగీకరించడం లేదన్నారు. 20 శాతం ఇన్ సర్వీసు కోటా ఇస్తే ప్రభుత్వ అవసరానికి మించి పిజి వైద్యులు అందుబాటులోకి వస్తారని, వీరి సేవలు వినియోగించుకోవడానికి ఖాళీ పోస్టులు లేవని పేర్కొన్నారు.

పని గంటల పెంపు బిల్లుపై రేపు నిరసనలు

- జయప్రదం చేయాలని సిఐటియు, రైతు, కార్మిక సంఘాలు పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో 8 గంటల పని 13 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ఆమోదించటాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 7న జిల్లా కేంద్రాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిఐటియు, ఎపి రైతు, ఎపి కౌలు రైతు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘాలు ఉమ్మడిగా పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఆయా సంఘాల ప్రధాన కార్యదర్శులు సిహెచ్ నరసింగరావు, ప్రభాకర్ రెడ్డి, హరిబాబు, వి వెంకటేశ్వర్లు ఆదివారం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల చట్టాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను ఆమోదించిందని పేర్కొన్నారు. కోడ్‌లు అమలు చేయటంలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం పని గంటలను పెంచి కార్మికుల శ్రమను యాజమాన్యాలు మరింత దోచుకోవడానికి అవకాశం కల్పించిందని విమర్శించారు. ఎక్కువ సెలవులు పొందే విధంగా ఈ సవరణలు చేస్తున్నామని చెప్పటం కార్మికులను మోసగించటానికేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక బిజెపి ప్రభుత్వం మొదటగా 2023లో ఫ్యాక్టరీల చట్టానికి సవరణలు చేసి పని గంటలు రోజుకు 12 గంటలు చేసిందని తెలిపారు. వారానికి 48 గంటల పని కొనసాగుతుందని, వారంలోపే 48 గంటలు పూర్తయితే మిగతా రోజులు వేతనంతో కూడిన సెలవు దినాలుగా పరిగణించబడతాయని చెప్పిందని పేర్కొన్నారు. గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వం 2025 జులైలో 12 గంటల పని దినం బిల్లు ఆమోదించిందని తెలిపారు. ఇదే దారిలో రాష్ట్రంలో టిడిపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నడుస్తోందని పేర్కొన్నారు. కనీసం కార్మిక సంఘాలతో చర్చించకుండా నేరుగా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.. ప్రపంచమంతా ఆమోదించిన 8 గంటల పని, 8 గంటలు కుటుంబం, సామాజిక కార్యక్రమాలు, 8 గంటలు విశ్రాంతి పద్ధతిని మార్పు చేయటాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 7న జరిగే నిరసనలో ప్రజలు, కార్మికులు పాల్గొనాలని కోరారు.

బ్యాడ్జి ఉన్న డ్రైవర్లందరికీ లబ్ధి చేకూర్చాలి

- ఎపిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం బ్యాడ్జి కలిగిన డ్రైవర్లు 13 లక్షల మందికి 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని వర్తింపజేయాలని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ప్రభుత్వం లబ్ధి చేకూర్చిన ఆటో డ్రైవర్ల సంఖ్య వాస్తవంగా ఉన్న సంఖ్యలో 10 శాతం కూడా లేదని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హతలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని చెప్పారు. పథకం ప్రారంభించే సమయానికి కేవలం 2.90 లక్షల మందినే అర్హులుగా ప్రకటించడం దారుణమన్నారు. సిఎం చంద్రబాబు ఏ పథకం అమలు చేసినా కోతలేనని విమర్శించారు. ఆటోల్లో తిరిగి, ఖాకీ చొక్కాలు ధరించి ఫొటోలకు ఫోజులిచ్చినంత మాత్రాన వారి కుటుంబాలను ఉద్ధరించినట్లు కాదన్నారు. ఆటో డ్రైవర్లను మోసగించడంలో గత వైసిపి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం తేడా లేదని పేర్కొన్నారు. పథకం అమలులో ఓనర్ కం డ్రైవర్ విధానాన్ని ఎందుకు ఎంచుకున్నారని ప్రశ్నించారు. ఆటో నడుపుకుని బతికే వారిని విస్మరించడం సరికాదన్నారు. పథకంలో కోత పెట్టేందుకే 18 నిబంధనలు తెచ్చిపెట్టారని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

మెయిల్ అధినేత కృష్ణారెడ్డికి మాతృవియోగం

- పలువురు ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు (కృష్ణా జిల్లా)



కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు చెందిన మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) అధినేత పురిటిపాటి కృష్ణారెడ్డి తల్లి పురిటిపాటి విజయలక్ష్మి (75) ఆదివారం కన్నుమూశారు. డోకిపర్రులోని స్వగృహంలో తెల్లవారుజామున ఆమె మరణించారు. విజయలక్ష్మి భౌతికకాయాన్ని ఆమె తమ్ముడు పామిరెడ్డి పిచ్చిరెడ్డి (పిపి రెడ్డి), మాజీ మంత్రులు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), పేర్ని వెంకట్రామయ్య (నాని), మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. విజయలక్ష్మికి ఇద్దరు కుమారులు. కృష్ణా రెడ్డి చిన్న కుమారుడు. విజయలక్ష్మి అంతిమయాత్రలో మెయిల్ అధినేత కృష్ణారెడ్డి, వైఎస్ఆర్ సన్నిహితుడు కెవిపి రామచంద్రరావు, రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, గుడివాడ ఎంఎల్ఎ వెనిగండ్ల రాము, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, ఎంపి సీఎం రమేష్ తదితర ప్రముఖులతో పాటు డోకిపర్రు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాభివృద్ధిలో విజయలక్ష్మి పాత్ర ఎంతో అమూల్యమైనది. మెయిల్ వారు నిర్వహిస్తున్న కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సిఎస్ఆర్) కింద గ్రామాభివృద్ధిలో ఆమె పాత్ర కీలకమైనది. పేద వర్గాలకు ఆమె ఎనలేని సేవలందించారు. డోకిపర్రులోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు ఆలోచనలు మానుకోవాలి

ప్రజాశక్తి- పాచిపెంట

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం ఆలోచనలను మానుకో వాలని నవయుగ కంపెనీకి ఇచ్చే అనుమతులు రద్దు చేయాలని శతాబి సర్పంచ్ శిల్పజన్ని రామయ్య ఆధ్వర్యంలో ఆదివారం సతాబి గ్రామం వద్ద కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ ఆదివాసీలను జల సమాధి చేసి హైడ్రో ప్రాజెక్టు నిర్మాణం చేయవద్దని, ఇటువంటి ఆలోచనలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని హెచ్చరించారు. మోడీ, కూటమి ప్రభుత్వం కలిసి నవయుగ కంపెనీకి దాసోహంతో అవుతూ అనుకూలమైన నెంబర్ 13 తీసుకు వచ్చారన్నారు. వెంటనే ఆ జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సభలు పెట్టకుండా పీసా చట్టాన్ని తుంగలో తొక్కడం, గిరిజను పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తుండడం దుర్మార్గమన్నారు. గిరిజనులంతా ఐక్యంగా హైడ్రోపవర్ ప్రాజెక్టు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 8న గుమ్మకోట జంక్షన్ నుండి శతాబి వరకు జరగనున్న ర్యాలీలో ఆదివాసి గిరిజనులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు శిల్ప జల్లి శ్రీరామ్, ఎ.గిన్నెల జానకిరామ్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి



గుంటూరు విద్యానగర్ రోడ్లపై భారీగా చేరిన వర్షం నీరు

ప్రకాశం బ్యారేజికి కొనసాగుతున్న వరద

- గుంటూరులో కుండపోత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజికి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజికి 2.44 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి 1.84 లక్షల క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. రాయలసీమ, తెలంగాణ ప్రాంతంలో కురిసిన వర్షాలతో నాగార్జున సాగర్‌కు 2.61 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పులిచింతలకు ఎగువ నుంచి 2 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోంది. దిగువకు 17 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అయితే ఖమ్మం, ఎన్‌టిఆర్ జిల్లాల్లో కురిసిన వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి 2.44 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండగా అదే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

బంగాళాఖాతంలో ఏర్పడి వాయుగుండం తీరం దాటడంతో గుంటూరులో ఆదివారం భారీ వర్షం కురిసింది. శనివారం కురిసిన వర్షం కంటే ఆదివారం మరింత వర్షం కురవడంతో పలు ప్రాంతాలు జలమయమమై రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో దాదాపు రెండు గంటల పాటు వర్షం బీభత్సం సృష్టించింది. గుంటూరులోని మూడు వంతెనల రహదారి, కంకర గుంట ఆర్‌యుబి వద్ద నీరు నిలిచింది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఈ మార్గంలో నిలిచిపోయింది. స్థానిక శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండడంతో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు ప్రస్తుతం కంకరగుంట ఆర్‌ఒబి మాత్రమే అందుబాటులో ఉండడం వల్ల వాహనాల రాకపోకలకు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. రహదారులపై మురుగునీరు, వర్షం నీరు కలిసి పారడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. గుంటూరుతో పాటు పరిసర మండలాల్లోనూ ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తెనాలి, పొన్నూరు, మంగళగిరి, గుంటూరు యోజకవర్గాల్లోని పొలాల్లోకి నీరు చేరడంతో వరి, పత్తి పంటలకు నష్టమని రైతులు వాపోతున్నారు.

నేడు పిడుగులతో కూడిన వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నాడు పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అన్నమయ్య, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం పలు ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 79.7 మిల్లీమీటర్లు, పల్నాడు జిల్లా గుట్లపల్లిలో 60, నెల్లూరు జిల్లా జలదంకిలో 33.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందని ప్రఖర్‌జైన్ తెలిపారు.

కురుపాం ఘటనపై సిఎం క్షమాపణ చెప్పాలి

- మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున సాయం చేయాలి
- వైసిపి అధినేత వైఎస్ జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కురుపాం గురుకుల పాఠశాలలో గిరిజన బాలికల మృతికి నైతిక బాధ్యత వహిస్తూ సిఎం చంద్రబాబు.. మృతుల కుటుంబాలకు క్షమాపణ చెప్పాలని, ప్రభుత్వం చేసిన తప్పిదం ఫలితమే కాబట్టి తక్షణమే ఆయా కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పిల్లల ఆరోగ్యం, పాఠశాలల వసతుల పట్ల శ్రద్ధ పెట్టాలన్నారు. చంద్రబాబు పాలనలో నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా పేద విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని, కురుపాం బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో ఆర్‌ఒ ప్లాంట్లు పాడవడంతో కలుషిత నీరు తాగడంతో పచ్చకామెర్లు వచ్చి నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరు బాలికలు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. 'గిరిజన బాలికలు, పేద పిల్లలు అంటే అంత చులకనా? ఒక్క పార్వతీపురం మన్యం జిల్లాలోనే ఒక్క ఏడాదిలోనే 11 మంది విద్యార్థులు అనారోగ్యంతో మరణించినా మీరు కళ్లు మూసుకున్న మాట వాస్తవం కాదా? ఈ మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే చంద్రబాబు' అంటూ జగన్ పోస్టు చేశారు.

అక్రమ మద్యం వ్యాపారులు టిడిపి నేతలే : వైఎస్ జగన్

అక్రమ మద్యం తయారీదారులు టిడిపి నేతలేనని, తయారు చేసిన మద్యాన్ని వాళ్ల షాపుల ద్వారా బెల్టు షాపులకు అమ్మకాలు సాగిస్తున్నారని వైఎస్ జగన్ ఆరోపించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో టిడిపి నాయకులు ఏకంగా కల్తీ మద్యం తయారీ ఫ్యాక్టరీయే పెట్టి సప్లై చేసిన ఘటన రాష్ట్రంలో మద్యం అక్రమాలకు నిదర్శనగా నిలుస్తోందన్నారు. కాగ్ 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారానే లిక్కర్ అమ్మకాలు ఉన్నప్పుడు రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం రూ.6,782.21 కోట్లు కాగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఐదు నెలల్లో లిక్కర్ ఆదాయం రూ.6,992.77 కోట్లు మాత్రమేనన్నారు. వృద్ధి కేవలం 3.10 శాతం మాత్రమేనని, ఎక్కడైనా ప్రతియేటా సహజంగా వచ్చే 10 శాతం పెరుగుదల కూడా రాలేదంటే ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయాన్ని సిండికేట్ల రూపంలో కల్తీ లిక్కర్ తయారీ రూపంలో మీ అనుచరులు కొట్టేస్తున్నట్లుగా అర్థం కదా? అని జగన్ ప్రశ్నించారు.

నేడు విశాఖ పోర్టుకు విఎల్‌జిసి 'శివాలిక్' రాక

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



శివాలిక్ నౌక

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సిఐ) యాజమాన్యం కిందకు వచ్చిన విఎల్‌జిసి (వెరీ లార్జ్ గ్యాస్ క్యారియర్) నౌక తొలిసారిగా దేశంలోని విశాఖపట్నం పోర్టుకు సోమవారం రానుంది. దీనికి కేంద్ర పోర్టులు, నౌకలు, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ విశాఖ సముద్రంలో ఘనంగా స్వాగతం పలకనున్నారు. ఎస్‌సిఐ సెప్టెంబర్ 10న శివాలిక్ నౌకను స్వాధీనం చేసుకుంది. భారత సముద్ర రవాణా రంగంలో ఇదొక మైలురాయి. ఈ నౌక విశాఖపట్నం పోర్టుకు తన తొలి ప్రయాణంలో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి)ను తీసుకురానుంది. భారత గ్యాస్ లాజిస్టిక్స్ సామర్థ్యాలను మరింతగా బలోపేతం చేయడమే కాకుండా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఇది కీలక అడుగుగా నిలవనుందని అధికారులు చెబుతున్నారు. శివాలిక్ నౌక తూర్పు తీరంలో సముద్ర వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని, విశాఖపట్నం పోర్టును శక్తివంతమైన సరుకు రవాణాకు ప్రధాన ద్వారంగా నిలబెడుతుందని విశాఖ పోర్టు సెక్రటరీ టి.వేణుగోపాల్ మీడియాకు ఆదివారం తెలిపారు. సోమవారం జరిగే కార్యక్రమానికి ఎస్‌సిఐ, విపిఎ ఉన్నతాధికారులు హాజరవుతారని వివరించారు. కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ శాలిగ్రాంపురంలోని సాగరమాల కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న సమావేశంలో పాల్గొని విశాఖపట్నం పోర్టు అథారిటీ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు.

శ్రీశైలం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- పులుల సంఖ్య పెరిగేలా యాక్షన్ ప్లాన్
- సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాన్ని సమగ్రమైన మాస్టర్ ప్లాన్‌తో దివ్య క్షేత్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని దేవాదాయశాఖ అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ నెల 16న ప్రధాని శ్రీశైలం రాక నేపథ్యంలో దేవాదాయ, అటవీశాఖ అధికారులతో ఆదివారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి సిఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుమల తరహాలోనే శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రద్దీకి తగ్గట్లు సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. ఆలయాల అభివృద్ధికి రెండు వేల హెక్టార్ల అటవీశాఖ భూమిని దేవాదాయశాఖకు కేటాయించేలా కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. ప్రధాని శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు శ్రీశైలం రాక దృష్ట్యా ఆలయ అభివృద్ధిపై ఆయనతో చర్చించాలన్నారు. శ్రీశైల క్షేత్రానికి జాతీయ రహదారులను సైతం అనుసంధానించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సిఎం సూచించారు. దోర్నాల, సున్నిపెంట, ఈగలపెంట ప్రాంతాల సమీపంలోని జాతీయ రహదారులను ఆలయానికి కనెక్ట్ చేయాలన్నారు. పర్యాటక ప్రాంతంగా, పర్యావరణ పరంగా శ్రీశైలాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు ఉండాలన్నారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. ఆలయ సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ ప్రాంతంలోని శబరిమల వంటి ఆలయాల్లో యాత్రికులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధ్యయనం చేసి శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేద్దామన్నారు. శ్రీశైలం అభయారణ్యంలో పులుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అన్నారు.



బోచర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఐద్వా రాష్ట్ర మహాసభ సాంస్కృతిక కార్యక్రమాల బ్రోచర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల బ్రోచర్‌ను ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.సావిత్రి ఆదివారం ఆవిష్కరించారు. అనంతపురంలోని ఎన్‌జిఒ హోమ్‌లో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఐద్వా జిల్లా అధ్యక్షులు శ్యామల, డ్యాన్స్ మాస్టర్ వన్నూరుస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐద్వా 16వ రాష్ట్ర మహాసభ అక్టోబర్ 13, 14, 15 తేదీల్లో అనంతపురంలోని ఎంకెఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలను స్థానిక కృష్ణకళా మందిరంలో ప్రతిరోజు సాయంత్రం 5:30 గంటల నుంచి రాత్రి 8:30 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ దర్శకులు ఉమామహేశ్వరరావు, డిఆర్‌ఒ ఎ.మలోల, లలిత కళా పరిషత్ కార్యదర్శి గాజుల పద్మజ, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలకు పాఠశాలల, కళాశాలల నుంచి పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొని వారిలోని సృజనాత్మకతను ప్రదర్శించాలని సూచించారు. డ్యాన్స్ మాస్టర్లు, కవులు, కళాకారులు, ఉద్యోగులు, ప్రజలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రచయిత రియాజుద్దీన్, టివి.రెడ్డి, డ్యాన్స్ మాస్టర్ విష్ణు, ఐద్వా నగర కార్యదర్శి అశ్విని, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

అందరి ఆమోదంతోనే కార్గో ఎయిర్‌పోర్టు

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- ఎకరాకు రూ. కోటి పరిహారం ఇవ్వాలి : రైతులు

ప్రజాశక్తి - పలాస, వజ్రపుకొత్తూరు

శ్రీకాకుళం జిల్లా మందస మండలంలో ప్రతిపాదిత విమానాశ్రయం నిర్మాణానికి అందరి ఆమోదంతోనే ముందడుగు వేస్తామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై పలాస రైల్వే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రైతులతో అవగాహనా సదస్సు నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కెవి మహేశ్వర రెడ్డి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సదస్సును ఎయిర్‌పోర్టు ప్రభావిత ప్రాంతాల రైతులు బహిష్కరించగా, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అనుకూల రైతులతో నిర్వహించారు. ఈ సందర్భంగా మందస మండలం బిడిమి, చీపురుపల్లి, వంకులూరు, మెట్టూరు, బేతాళపురం గ్రామాలకు చెందిన రైతులు మాట్లాడుతూ ఎకరాకు రూ కోటి పరిహారం ఇవ్వాలని, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, రైతులకు నెలకు రూ.పది వేలు చొప్పున పెన్షన్ ఇవ్వాలని కోరారు. సర్వే విషయంలో ఏ గ్రామంలో ఎంతమేర భూమి అవసరమో స్పష్టత ఇవ్వాలన్నారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ విమానాశ్రయం నిర్మాణం వల్ల అనుసంధానంగా పరిశ్రమలు, మౌలిక వసతులతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. సర్వేలు చేస్తే తప్ప కచ్చితంగా ఎంత భూమి అవసరమో చెప్పలేమని తెలిపారు. సర్వేలకు సహకరించాలని కోరారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల ఏ గ్రామం కూడా పోవడం లేదని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతుల నుంచి భూసేకరణ చేస్తామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి పృథ్వీరాజ్, ఆర్‌డిఒ జి వెంకటేష్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'పెన్నా'లో ఇద్దరు యువకులు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం.. మరొకరి కోసం గాలింపు

ప్రజాశక్తి - నెల్లూరు

ఈత సరదా ఇద్దరు యువకులను కాటేసింది. నెల్లూరు పరిధిలోని దేవరపాళెం, ఐఎంఎల్ డిపో ప్రాంతానికి చెందిన కోటయ్య (20), విశాల్ (21) సరదాగా ఈత కొట్టేందుకు పెన్నా నదిలోకి దిగారు. ప్రవాహం పెరగటంతో ఆ ఇద్దరు యువకులూ కొట్టుకుపోతుండటంతో స్థానికులు గుర్తించి వెంటనే వారిని కాపాడేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ సమాచారం పోలీసులకు, రెవెన్యూ అధికారులకు చేరడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యల్లో భాగంగా విశాల్ అనే యువకుడి మృతదేహాన్ని గుర్తించి పెన్నా నది ఒడ్డుకు తీసుకురావడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం మృతుని కుటుంబ సభ్యుల ఆక్రందనలు మిన్నంటాయి. మరో యువకుడు కోటయ్య కోసం వెంకటగిరి నుంచి వచ్చిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం, గజ ఈతగాళ్లు విస్తృతంగా గాలిస్తున్నారు. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆ ప్రాంతానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 65 | విజయవాడ, సోమవారం 6 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 6 October 2025 | Rs

శ్రీశైలం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- పులుల సంఖ్య పెరిగేలా యాక్షన్ ప్లాన్
- సమీక్షలో సిఎం చంద్రబాబు

2



భారత అమ్మాయిల జైత్రయాత్ర
- పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం
- భారత్ 247/10, పాకిస్తాన్ 159/10

8

ఉద్రిక్తంగా భూ పోరాటం

జోరువానలోనూ సిపిఎం ఆధ్వర్యాన పేదల ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులు
- ఎమ్మెల్యే మాట నిలబెట్టుకోవాలి : కె మురళి
- ఆర్‌డిఓ హామీతో విరమణ


పేదల ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)
నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నాడు పేదలు నిర్వహించిన భూ పోరాటం పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తంగా మారింది. అయితే పోలీసు ఆంక్షలను, జోరువానను లెక్కచేయకుండా పేదలు తమ ఆందోళనను కొనసాగించారు. ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తున్న ట్రైనింగ్ అకాడమి స్థలంలోకి ప్రవేశించి ఎర్రజెండాలు ఎగురవేశారు. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం మంగళం పరిధిలోని తిరుమలనగర్ గ్రామపంచాయతీలోని ట్రైనింగ్ అకాడమి స్థలాన్ని పేదలకు మంజూరు చేయిస్తానని చంద్రగిరి ఎంఎల్‌ఎ పులిపర్తి నాని గతంలో హామీ ఇచ్చారు. అయితే, కొంత కాలంగా ఈ స్థలాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. అయినా, అధికారయంత్రాంగం స్పందించలేదు. ఈ నేపథ్యంలో సిపిఎం ఆ స్థలంలోకి ప్రవేశించి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని పేదలకు పిలుపునిచ్చింది. ఆ పిలుపు మేరకు పెద్ద సంఖ్యలో పేదలు తిరుపతి- కరకంబాడి మార్గంలోని బొమ్మల క్వార్టర్స్ వద్దకు ఆదివారం ఉదయం పెద్దసంఖ్యలో చేరుకున్నారు. సిపిఎం నాయకులు కందారపు మురళి ఆధ్వర్యంలో ఎర్రజెండాలు చేపట్టి ఆ స్థలం వద్దకు వెళ్తుండగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే బైఠాయించి ఆందోళన కొనసాగించారు. పెద్ద ఎత్తున వర్షం కురుస్తున్నా ప్రజలు వెనక్కి తగ్గలేదు. పోలీసులతో వాగ్వివాదానికి దాగారు. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ సర్వే ట్రైనింగ్ అకాడమీ భూములు ఆక్రమణకు గురవుతు న్నాయని తాము ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, ఆక్రమణలను అడ్డుకొని నిలువరించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 2, 700 పట్టాలు పేదలకు ఇచ్చారని, స్థలం నేటికీ చూపలేదన్నారు. అప్పటికి, ఇప్పటికి తేడా ఏమీ కనబడటం లేదన్నారు. ఎంఎల్‌ఎ ఇళ్లస్థలాలిస్తామంటూ పేదలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తిరుపతి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ రామ్మోహన్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సిపిఎం నేతలు, పేదలతో మాట్లాడారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పారు. మంగళం ప్రాంతంలో ఉన్న పేదలందరికీ తిరుమల నగర్ ప్రాంతంలోనే ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రజలందరూ ఇళ్లస్థలాల కోసం 10వ తేదీన ఆర్డీవో కార్యాలయానికి వచ్చి అర్జీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలు చేయాలని పూనుకుంటే ఎంతటి వారినైనా విడిచిపెట్టేది లేదన్నారు. ఆర్‌డిఓ ఇచ్చిన హామీతో సిపిఎం నేతలు చేపట్టిన భూ పోరాటాన్ని విరమించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం, నగర కార్యదర్శి కె.వేణుగోపాల్, జిల్లా నేతలు ఎస్.జయచంద్ర, మాధవ్, సాయిలక్ష్మీ, రవి పాల్గొన్నారు.

7న రాష్ట్రస్థాయి ధర్నా
- ఫ్యాప్టో ప్రకటన
- భారీగా తరలిరావాలని ఉపాధ్యాయులకు పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలసాధనతో పాటు బోధనేతర పనులకు ఉపాధ్యాయులకు వినియోగిస్తుండటాన్ని నిరసిస్తూ ఈనెల 7న విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో ప్రకటించింది. ఈ ధర్నాకు వేలాదిగా తరలిరావాలని ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చింది. విజయవాడ హనుమాన్‌పేటలోని ఎస్‌టియు భవన్‌లో ఆదివారం ఎపి ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా "పోరుబాట" వాల్‌పోస్టర్‌ను. ఫ్యాప్టో ఛైర్మన్ ఎల్ సాయి శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్ చిరంజీవి, డిప్యూటీ సెక్రటరీ జనరల్, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 11వ పిఆర్‌సి గడువు ముగిసి రెండేళ్లయినా నేటికీ 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో ఆందోళన నెలకొందన్నారు. పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించే ప్రక్రియ ఆలస్యమవుతున్న నేపథ్యంలో తక్షణమే 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలనే డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన 4 డిఎలు తక్షణమే డిఎ బకాయిలు విడుదల చేయాలని కోరారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని, కలెక్టర్ పూల్ ద్వారా వెంటనే పోస్టింగ్‌లివ్వాలన్నారు. గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూల్స్, సొసైటీలకు 62 సంవత్సరాలకు ఉద్యోగ విరమణ వయస్సును పెంచాలన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 8నుంచి బోధనేతర పనులను బహిష్కరిస్తామని చెప్పారు.



అంబులెన్స్‌లో విశాఖ కెజిహెచ్‌కు విద్యార్థినులను తరలిస్తున్న పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యులు

కెజిహెచ్‌కు మరో 13 మంది
- కురుపాం విద్యార్థినుల తరలింపు
- ప్రిన్సిపల్, ఎఎన్ఎం సస్పెన్షన్
- కురుపాం, అనంతపురం ఘటనలపై నివేదిక కోరిన సిఎం
- గురుకుల పాఠశాలకు వారం రోజులు సెలవు : కలెక్టర్
- బాధితులకు మంత్రులు, అధికారులు, ఎస్ఎఫ్ఐ పరామర్శ

ప్రజాశక్తి- యంత్రాంగం
పచ్చకామెర్లతో బాధపడుతున్న పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన మరో 13 మంది విద్యార్థినులను విశాఖ కెజిహెచ్‌కు ఆదివారం తరలించారు. దీంతో, ఈ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి సంఖ్య 41కు చేరింది. పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో 72 మంది, కురుపాం సిహెచ్‌సిలో ఆరుగురు విద్యార్థినులు చికిత్స పొందుతున్నారు. ఇద్దరు విద్యార్థినుల మృతి, పలువురు విద్యార్థినులు పచ్చకామెర్ల బారిన పడడంతో పాఠశాల ప్రిన్సిపల్ ఎం.అనూరాధను, ఎఎన్ఎం ఎస్.విజయలక్ష్మిని అధికారులు సస్పెండ్ చేశారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా బి.విజయలక్ష్మిని నియమించారు. కురుపాం, అనంతపురం ఘటనలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక అందజేయాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మంత్రులు, అధికారులు పరామర్శించారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన 611 మందికి విద్యార్థినులకు రెండు రోజులు క్రితం వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో కొంతమంది నివేదికలు ఇంకా రావాల్సి ఉంది. ఆ నివేదికలో ఏం వస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళనగా ఎదురు చూస్తున్నారు. త్వరలోనే మిగిలిన వారి నివేదికలు రానున్నాయని అధికారులు తెలిపారు. పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో 13 మంది విద్యార్థినులను సీరం బిలిరుబిన్ ఐదు పాయింట్లు మించి ఉండడంతో ముందస్తు జాగ్రత్తలు, మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు తరలించినట్లు చెప్పారు. మిగిలిన వారి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపారు.

గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి పరామర్శ
పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మిగతా 7లో


డార్జిలింగ్‌లో వరద పోటెత్తడంతో కొట్టుకుపోతున్న వాహనాలు

డార్జిలింగ్‌లో పెను విషాదం
- కొండచరియలు విరిగిపడి 23 మంది మృతి
- అనేక మందికి గాయాలు
- పలుచోట్ల ఇళ్లు, రహదారులు ధ్వంసం
- చిక్కుకున్న వందలాది పర్యాటకులు

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర ప్రాంతంలో భారీ వర్షాలు అతలాకుతలం సృష్టించాయి. ముఖ్యంగా ప్రముఖ పర్యాటక ప్రాంతమైన డార్జిలింగ్ జిల్లాలో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని పలుప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి 23 మంది మృతి చెందారు. అనేక మంది గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులేనని సమాచారం. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇళ్లు కొట్టుకుపోవడంతో పాటు రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి వందలాది మంది పర్యాటకులు మిగతా 7లో

చర్చలు విఫలం
- పిహెచ్‌సి వైద్యుల సమ్మె కొనసాగింపు

2

శాంతి ప్రణాళికపై నేడు త్రైపాక్షిక చర్చలు
- కైరో చేరుకుంటున్న హమాస్, ఇజ్రాయిల్, అమెరికా ప్రతినిధులు 7

నకిలీ మద్యం తయారీ కేసులో మరో ముగ్గురు అరెస్టు
నిందితులపై కఠిన చర్యలు
- సిఎం చంద్రబాబు సమీక్ష

6

ట్రంప్ సుంకాలపై నిరంతర పోరాటం
'భారత్‌పై ట్రంప్ సుంకాల యుద్ధం' పుస్తకావిష్కరణలో బివి రాఘవులు


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న బివి రాఘవులు, వి శ్రీనివాసరావు, లోకనాథం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
భారత దేశాన్ని బెదిరించేలా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలపై నిరంతరం పోరాటాన్ని కొనసాగిస్తామని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. రెండురోజుల పాటు జరగనున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైంది. ఈ సమావేశానికి సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు కె. లోకనాధం అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా 'భారత్‌పై ట్రంప్ సుంకాల యుద్ధం' అనే పుస్తకాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, లోకనాధంతో కలిసి బివి రాఘవులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ ఉత్పత్తులపై అమెరికా 50శాతం పన్ను విధిస్తూ ఏకపక్షంగా ప్రకటించడం దారుణమన్నారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నామని అదనంగా మరో 25శాతం పన్ను విధించడం దేశ సార్వభౌమత్వానికి గొడ్డలిపెట్టు వంటిదని అన్నారు. తమ ప్రజలకు అవసరమైన వాటిని ఏ దేశం నుంచి దిగుమతి చేసుకోవాలో నిర్ణయించుకునే హక్కు ప్రతి దేశానికి ఉందన్నారు. దీనికి భిన్నంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశం ఎక్కడ, ఏం కొనాలో బెదిరించి, లొంగదీసుకునే స్థితికి చేరుకోవడం గర్హనీయమన్నారు. దీనికి ధీటుగా జవాబివ్వడంలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం లేకపోవడం శోచనీయమని చెప్పారు. అనేక చిన్న చిన్న దేశాలు చూపిన ధైర్యాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం చూపలేదని, అమెరికాకు అణిగిమణిగి ఉండేలా అవమానకరంగా వ్యవహరించడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు అమెరికా సుంకాలను ప్రతిఘటించాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి హితవు పలికారు. ఈ సుంకాల పెంపు వల్ల రాష్ట్రంలో ఆక్వా, ఆభరణాలు, ఆటోమొబైల్స్ తయారీ రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని, లక్షలమంది ఉపాధి కోల్పోతున్న దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్1బి వీసాలపై విధించిన ఆంక్షలు సైతం మరింత భయపెట్టేలా ఉన్నాయని, ఉన్నత చదువుల అనంతరం ఉపాధి కోసం అమెరికా వెళ్లాలనుకునే వారికి ఇవి తీవ్ర ఆటంకంగా మారాయన్నారు.

అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో అంతా తెలుగువారే ఉన్నారని రాష్ట్ర యువతకు పదేపదే చెప్పే ముఖ్యమంత్రి, హెచ్1బి వీసాలపై విధించిన ఆంక్షలపై మాత్రం నోరుమెదపడం లేదని విమర్శిం చారు. భారతీయ సినీ రంగంపై కూడా అమెరికా 100శాతం పన్ను విధించిన విషయాన్ని ప్రస్తావించిన రాఘవులు దీనిపై కూడా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు గట్టిగా మాట్లాడే స్థితిలో లేవని విమర్శించారు. అమెరికా ఎగుమతి చేసుకుంటున్న వాటిపై పన్ను ఎత్తివేయాలని భారతదేశంపై ఒత్తిడి తేవడం ఇంకా ప్రమాదకరమన్నారు. ఇదే కనుక మిగతా 7లో

ఎం.వి.ఎస్.శర్మ

అదే నయవంచన, అదే కపటత్వం
ఆరెస్సెస్ అధినేత దసరా ప్రసంగం

ఆరెస్సెస్ వందేళ్ళు పూర్తి చేసుకుంది. 1925 దసరా నాడు ప్రారంభం అయిన ఈ సంస్థ ఈ దసరా నాడు తన శత సంవత్సర వేడుకను జరుపుకుంది. ఆ సందర్భంగా జరిగిన సభలో ఆరెస్సెస్ సర్‌సంఘ్‌సంచాలక్ మోహన్ భగవత్ చేసిన ప్రసంగం ప్రత్యేకమైనది. ఈ ప్రసంగం నేడు దేశాన్ని పాలిస్తున్న ఆరెస్సెస్ వారికి, ఇటు సంఘ కార్యకర్తలకు మార్గనిర్దేశనం చేసింది. ఆ ప్రసంగాన్ని ప్రధాన మీడియాల ఆకాశానికెత్తుకుంది. మోహన్ భగవత్ ప్రసంగంలోని గంభీర పదాలను చూసి మురిసిపోయేవారు "ఏ నినాదం వెనుక ఏ వర్గ ప్రయోజనాలు దాగివున్నాయో తెలుసుకోలేనంత కాలం ప్రజలు మోసపోతూనేవుంటారు" అన్న లెనిన్ హెచ్చరికను గుర్తు చేసుకోవాలి. తన ప్రచారాన్ని నయవంచనతో మేళవించడంలో ఆరెస్సెస్ నేతలది అందె వేసిన చెయ్యి.

ఆరెస్సెస్ దేశంలో అన్ని రంగాల్లో కేంద్ర బిందువుగా, బలమైన శక్తిగా ఉంది అని ప్రకటించిన నోటితోనే ఆరెస్సెస్ రాజకీయ సంస్థ కాదని, రాజకీయాలకు దూరంగా ఉంటుందని చెప్పుకున్నారు. రాజకీయాలతో తమకు సంబంధం లేదంటూనే జాతీయ, అంతర్జాతీయ విషయాల్లో అనుసరించవలసిన విధానాలను ప్రకటించారు మోహన్ భగవత్. విదేశాంగ సంబంధాలు, ఆర్థిక విధానాలు, శాంతిభద్రతలు, పేదరికం వంటి పలు అంశాలను లేవనెత్తుతూ వాటిపట్ల ప్రభుత్వం ఏ వైఖరిని అవలంబించాలో కూడా సూచించారు. ఇవేవీ రాజకీయం కానేకావట! 50 ఏళ్ళ క్రితమే ఆరెస్సెస్‌ను ప్రత్యక్ష రాజకీయాలలోకి ఆహ్వానించారని, కాని తాము అందుకు తిరస్కరించామని కూడా చెప్పుకున్నారు. అన్ని అధికార వ్యవస్థలనూ తమ చెప్పుచేతల్లో ఉంచుకుంటూ, ప్రభుత్వంలో అన్ని పదవులనూ తమ అనుయాయులతో నింపి, తాము మాత్రం అధికారానికి, రాజకీయాలకు దూరంగా ఉంటామని ప్రకటించుకోవడం కన్నా మోసం ఏముంది; దాదాపు 50 కి పైగా వివిధ సంస్థలను "పరివార్" లో భాగంగా నడుపుతూ, వాటిని నిర్దేశిస్తూ, అధికారాన్ని చేజిక్కించుకుని రాజకీయ పెత్తనం చెలాయిస్తున్న ఏకైక "రాజకీయేతర" సంస్థ ప్రపంచం మొత్తం మీద ఆరెస్సెస్ మాత్రమే.

గాంధీ గారిని స్మరించుకుంటూ ప్రసంగాన్ని ఆరంభించారు మోహన్ భగవత్. గాంధీ నాయకత్వాన్ని, దార్శనికతను శ్లాఘించారు. గాంధీ దేశం కోసం తన జీవితాన్ని బలిదానం చేశాడన్నారు. ఈ మాటలన్నది గాంధీజీని బలితీసుకునే పథక రచన చేసిన సంస్థ అధినేత! ఇంతకన్నా కపటత్వం ఉంటుందా? గాంధీజీ వంటి మహానేతను అన్యాయంగా హత్య చేశామే అన్న విచారం ఇసుమంతైనా ఆ సంస్థకి ఉందా? గాంధీజీ తోపాటు అంబేద్కర్, లాల్ బహదూర్‌శాస్త్రి, రామ్ మనోహర్ లోహియా వంటి జాతీయోద్యమ నాయకులను తలుచుకున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తప్ప మరో విధంగా ఏ దేశమూ ముందుకు పోలేదన్నారు. కాని ఆ ప్రజాస్వామ్య వ్యవస్థ రూపొందడానికి కారణమైన జాతీయోద్యమం గురించి ఒక్క మాట కూడా ప్రస్తావించలేదు. బ్రిటిష్ వలస పాలన దుర్మార్గాలగురించి, కొల్లగొట్టిన తీరు గురించి ఒక్క ముక్క కూడా లేదు. కారణం స్పష్టమే. ఆ జాతీయోద్యమంలో పాల్గనకుండా, బ్రిటిష్ పాలకులకు విధేయులుగా వ్యవహరించిన చరిత్ర ఆరెస్సెస్ ది. జాతీయోద్యమానికి దూరంగా ఉండడమే కాక, స్వాతంత్ర్యం వచ్చిన తొలిదినాల్లోనే దేశంలో అనేక ప్రాంతాల్లో మత కల్లోలాలకు ఆజ్యం పోసి, గాంధీజీ హత్య. దాని పర్యవసానంగా నిషేధాన్ని ఎదుర్కొన్నారు. దేశభక్తి గురించి, సమైక్యత గురించి కబుర్లు చెప్పడమే తప్ప వాస్తవంగా దేశ సమైక్యత ప్రమాదంలో పడిన సందర్భాల్లో, అది అస్సాం, గూర్ఖాలాండ్, ఖలిస్తాన్ వేర్పాటువాదం విజృంభించి పెనుసవాలుగా మారినప్పుడు ఆరెస్సెస్ ఎక్కడుంది? చెప్పుకోడానికేమైనా ఉందా? "మా దేహాలు ముక్కలైనా, ఈ దేశాన్ని ముక్కలు కానివ్వం" అంటూ దృఢంగా నిలబడి వందలాదిమంది కార్యకర్తలు ప్రాణాలొడ్డి దేశ సమైక్యతను కాపాడుకున్న చరిత్ర కమ్యూనిస్టులకు ఉంది. వేర్పాటువాదాన్ని ఓడించిన పటిమ వారికుంది.

మోహన్ భగవత్ ప్రసంగంలో మోడీ ప్రభుత్వాన్ని ప్రశంసలతో ముంచెత్తారు. పహల్గావ్ ఘటన అనంతరం ప్రభుత్వం చాలా గొప్పగా ప్రతిస్పందించిందని అన్నారు. మోడీ పాలన పట్ల దేశంలో యజమానులందరూ చాలా సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. (బహుశా ఇది మాత్రం నిజం) గత 11 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఏ రంగంలోనైనా సాధించిన స్పష్టమైన పురోగతి గురించి అధినేత ప్రసంగంలో ప్రస్తావించారా? దేశం ముందుకు పోతోందంటూనే ధనిక-పేద అంతరాలు పెరిగిపోవడం, పర్యావరణానికి ముప్పు పెరగడం, మానవీయ విలువలు తరిగిపోవడం వంటి ఆందోళనకర పరిణామాలను కూడా ప్రస్తావించారు. మరి ఇటువంటి ఆందోళనకర పరిణామాల్లోనే యజమానులు సంతృప్తిగా ఎలా ఉన్నారో? అందుకు కారణాలు ఏమిటో చెప్పలేదు. మన దేశ సార్వభౌమాధికారాన్నే అవహేళన చేసే రీతిలో ట్రంప్ పహల్గావ్ ఘటన సందర్భంగా పదే పదే ప్రకటనలు చేసిన ఖండించే ధైర్యం కేంద్రం చేయలేదు. ఏకపక్షంగా ట్రంప్ సుంకాలను పెంచుతూ పోతున్నా, వీసాల ఫీజు అమాంతం పెంచివేసినా పల్లెత్తుమాట అనలేని మోడీ ప్రభుత్వానికి ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ క్లిష్ట పరిస్థితుల్లో స్వంతంగా నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం ఉందని కితాబులిచ్చారు. బ్రెజిల్, వెనిజులా, కొలంబియా వంటి దేశాలు ట్రంప్ పెత్తనాన్ని సవాలు చేస్తున్నాయి. అమెరికా కన్నెర్ర చేసినా లెక్క చేయకుండా రష్యా నుంచి చమురు కొంటున్నా, ట్రంప్ వద్దన్నా బ్రిక్స్ లో పాల్గొన్నా అవి భారతదేశంలోని బడా కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడడం కోసం చేసిన పనులు. మరి అదే తెగువను ప్రదర్శించి అమెరికాతో ముడిసరుకుల, వ్యవసాయోత్పత్తుల వ్యాపారం విషయంలో ఎందుకు భారతీయ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ముందడుగు వేయకుండా "సంప్రదింపులు" కొనసాగిస్తున్నారు?

ప్రస్తుత సంక్షుభిత ప్రపంచానికి "విశ్వధర్మాన్ని" అందించే పని భారతదేశం మాత్రమే చేయగలదని చెప్పిన మోహన్ భగవత్ ట్రంప్ పొగరుబోతుతనం గురించి ఒక్క మాట కూడా అనలేకపోయారు. " తన దేశ ప్రయోజనాల రీత్యా ట్రంప్ వ్యవహరిస్తున్నాడు" అనడం అంటే పరోక్షంగా ట్రంప్‌ను సమర్థించడమే కదా! ఇదేనా విశ్వధర్మం?

మోడీ ప్రభుత్వం "రాజ్యాంగవిరోధుల్ని" అదుపు చేసిందని, దేశానికి ఉగ్రవాదం నుండి (అంటే నక్సల్స్ నుంచి) విముక్తి లభించిందని అన్నారు. అభివృద్ధి జరిగితే ఉగ్రవాదం తలెత్తదని సుద్దులు చెప్పారు. మరి 11 సంవత్సరాలుగా పాలిస్తున్న ప్రభుత్వం అక్కడ ఏ అభివృద్ధి చేసిందో చెప్పగలరా? అదానీలకు, ఇతర కార్పొరేట్లకు అడవులలోని ఖనిజసంపదను కట్టబెట్టడమే కదా మోడీ ప్రభుత్వం చేస్తున్నది? నక్సలైట్ల వలన రాజ్యాంగానికి ముప్పు వచ్చిందన్న మోహన్ భగవత్ మణిపూర్ లో, కాశ్మీర్ లో, తాజాగా లడఖ్ లో తలెత్తిందేమిటో, దానికి మూలకారణం ఎవరో చెప్పనేలేదు. వాటి ఊసెత్తనేలేదు.

'ఆత్మనిర్భరత' తోటే మనం ముందుకు పోగలుగుతాం అని భగవత్ ప్రకటించారు. స్వాతంత్ర్యం అనంతరం చాలా కాలం పాటు దేశ ఆర్థిక వ్యవస్థ తప్పుడుమార్గాన నడవడమే మన బలహీనతకు కారణం అన్నారు. ఆ మార్గం నుండి వెనక్కి మళ్ళడం తప్ప వేరే దారి మిగతా 7లో



ఉసురు..

పేర్చిన మూడు రాళ్ల మధ్య
ఎండు కట్టెలు ఎగదోసి
అగ్గిపుల్లతో వెలిగించే
పొయ్యి కాదు కదా
ఉక్కు ఫ్యాక్టరీ అంటే ...
బంగాళాఖాతంలో
ఎన్ని గొప్ప కెరటాలున్నా
ఉప్పునీటి రాశులతోనే
ఉక్కుమూకుడుని ఉడికించుకోలేం...
పంట పొలాలూ, పచ్చిక బయళ్లతో సహా
ఏభై ఊళ్లని ఒకేసారి బలిచ్చినా
ఉక్కు ముక్కు పుడక ధరించిన
కర్మాగారమైన అమ్మోరు కర్కశత్వపు గుండె
నులి వెచ్చని కన్నీటికి కరిగిపోదు...
తెలంగాణా తల్లి తట్టలతో తలకెత్తినా
మాధారం సున్నపు రాళ్లు
మాతా కబళానికి సరిపోవు...
చీపురుపల్లి గర్భాన్ని చీల్చుకొని చీపుళ్లతో ఊడ్చి పంపినా
మైకా పలుకులు మజ్జిగన్నంలో నంజుకొనేందుకే...
ఏలేశ్వరంతో ఎత్తిపోసిన ఏటినీరు
ముప్పొద్దుల మురికి కడుక్కోడానికే...

• • •

బేల చూపుల
బైల దిల్లా దిబ్బల నుంచీ
రైలుబళ్లపైన తేవాల్సిందే
ముడి ఇనుప ధాతువు...
రసాయన దినుసులుగా తరలించుకు రావాల్సిందే
బీహార్ లోయల నుంచీ లోహాసి బొగ్గు పెళ్లలు ...
కండపుష్టి పెంచుకోవడానికి
ఖండాంతర ఖనిజ గుళికల మీద ఆధారపడాల్సిందే...
తాల్చేరు తనువు నుంచీ తొల్చుకొచ్చిన
నల్లటి సిరులు కారు చీకటిలో విరులు పూయడానికే...
తాయిలాలకు చాలని తైల కందెనల బంధం
పీపాల రూపమై నౌకలెక్కి రావాల్సిందే
వ్యాయామించే యంత్రచక్రాల కోసం...

• • •

ఏకోన్ముఖమైన స్వేద రేణువులతో
లిఖితమైన బీజాక్షరాలు
ఇంక్విలాబ్ జిందాబాద్
ఇనుప నాలుకల మీద
వీరోచితంగా రచించినవే ...
తెలుగోడి త్యాగాలను తూయడానికి
వీగి పోతాయి, దగా తక్కెళ్ల తాళ్లు!
డాలర్ల అలల్లో ఓలలాడిన ఓడలు
అల్లాడి పోతున్నాయిప్పుడు
దళార్ల దారుణ క్రీడలో
లంగరు మోకులు తెగిన బెంగతో
శాశ్వతంగా ఓడిపోలేక ...
దునియా అంతా దున్నెయ్యాలనుకొనే
దున్నపోతు కడుపుల
గుజరాతు బనియాలకు
వజ్రాల దప్పిక ఇప్పట్లో తీరేది కాదు
గుప్పెట్లో ఎన్ని చిలక తోకలు చిక్కినా
పేగులు నిండని ఆకలికి అంతం లేదు
కోట్లాది అరచేతుల్లో
లిఖితమైన మెతుకుల రేఖల్ని
కొరుక్కు తినేసినా ...
(ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఉక్కు పోరాట స్ఫూర్తికి)

– సుదేరా, 97013 47080

ద్వేష భాష

తుపాకుల ధ్వనితోనే
తెల్లవారుతుంటుంది!
భయం పడగ నీడలో
వాళ్ళు కదులుతూ ఉంటారు!
అక్షరాలను దిద్దాల్సిన చేతులు
ఆయుధాలు పట్టుకుంటాయి
ట్వింకిల్ ట్వింకిల్ పలకాల్సిన నోళ్ళు
ట్రిగ్గర్ నొక్కుతుంటాయి!
బంధాలు దూరమవుతున్న
రణ వాతావరణయిం
ఏ ప్రేరణ ఊతమిస్తుందో తెలియదు!

విశ్వశాంతిని కీర్తించాల్సిన కంఠాలు
ద్వేష భాషతో రగిలి పోతాయి!
పూల మనసుల దినుసులేవి
ఆ క్షేత్రంలో మొలకెత్తవు!

మళ్ళీ మళ్ళీ
మానవత్వానికి శిలువ వేసే
మనుషులే మిగులుతారు!

– వీరేశ్వర రావు మూల, 94947 46228

తోవ అదే, ఊరే లేదక్కడ!

మతిలిబడ్డ ఊరిని వెతుకుతున్న కళ్ళకు
చిన్ననాటి ఊసులన్నీ పోల్చుమంది ఊరి తోవ
చెట్టు చెట్టున పక్షుల గూళ్ళు లెక్క పెట్టినట్టు
మొగలి పూల వాసనకు ముక్కులెగరేసినట్టు
రెల్ల పూలు ఎగరేసి గెంతులేసి ఆడినట్టు
తంగుడు పూలు జల్లుకొని తానమాడి మురిసినట్టు
అచ్చం అదే తోవ, ఊరికి వెళ్తున్నట్టు!

చెంగు చెంగున దూడలు గెంతులేసి పాడినట్టు
ఎద్దుల మెడలో గంటలు గణ గణ మ్రోగినట్టు
మనసులు కలుసుకొని నవ్వులు విరబూసినట్టు
చెమటను పండిరచి గంధాన్నే చిలికినట్టు
అచ్చం అదే తోవ, ఊరికి వెళ్తున్నట్టు!

వెళ్తూ వెళ్తూనే తెలిసింది ఆ గుర్తులైతే లేవు గానీ,
ఊరి తోవైతే అదే, ఊరే లేదక్కడ!
ఊరిని సమాధి కట్టేసిన
అభివద్ధి శిలాఫలకమైతే, ఇంకా బతికే ఉంది
భూమిచ్చిన ఊరికి జేజేలు పలుకుతూ ... !

– వినోద్ కుత్తుం, 96343 14502

రచన

పొద్దు పొడుపులో
వస్తువు నేరుకుంటా
మిట్ట మధ్యాహ్నంలో
నేల చాళ్ళలోంచి
తడి పదాలను కూర్చుకుంటా
సంజకెంజాయలో
స్వేదబిందువుల్ని ఆరబెట్టుకున్నట్లు
వరుస కట్టిన వాక్యాలను
కుదురుకోనిస్తా ...
రాత్రి జాములో
కునుకు దుప్పటి కింద
ఆ స్వరూపాన్ని మాగనిస్తా

తెల్లవారిందో
కవితను ఎగరేస్తా
బొండుమల్లెలు నవ్వుతుంటే
పక్షి రాగం తీస్తుంటే
జనం తల మీద పట్టుపాగై అలంకరిస్తది!

– దాసరాజు రామారావు

అక్షరం


ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti



సాహిత్యం అనేది మానవ ఆత్మకు
అత్యంత ఖచ్చితమైన ప్రతిబింబం.
రచయిత సత్యం ప్రవక్త మాత్రమే
కాకుండా జీవన నిర్మాణకర్తగా ఉండాలి.
సాహిత్యం ఉద్దేశ్యం మనిషిని తనను తాను,
తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం
చేసుకునేలా చేయడమే!

– మాక్సిం గోర్కీ

దాచేస్తే దాగని సత్యాలు



చరిత్ర

చరిత్ర అంటే కేవలం రాజులు, యుద్ధాలు, అధికార పీఠాల గురించి కాదు. చరిత్ర అంటే సామాన్య ప్రజల జీవితాలను, వారి కన్నీళ్లను, పోరాటాలను నమోదు చేయడం. దీనికి పూర్తి భిన్నంగా అధికారంలో ఉన్నవారు తమకు అనుకూలమైన కథలనే చరిత్రగా ప్రచారం చేస్తారు. అలాంటి ప్రచారాల మధ్య మరుగునపడిపోయిన, అణిచివేతకు గురైన చరిత్రను తిరిగి వెలికి తీయడం ఒక సవాలు. అఫ్సర్ రాసిన Remaking History: 1948 Police Action and the Muslims of Hyderabad అనే పుస్తకం అలాంటి సవాళ్లను అధిగమించి, మరుగునపడిన నిజాలను ప్రపంచానికి తెలియజేస్తుంది. ఈ పుస్తకం ఒక రాజ్య వ్యవస్థ పతనం గురించి మాత్రమే కాదు, ఒక ప్రత్యేకమైన సంస్కృతి, భాష, జీవన విధానం ఎలా ఛిన్నాభిన్నం అయ్యాయో కళ్ల ముందు ఉంచుతుంది. ఇది సమాజాన్ని జాగృతం చేసే హెచ్చరిక. మానవత్వం మీద రాజకీయాలు పడిన నీడలను తొలగించే ప్రయత్నం.

రాజకీయాల కోసం నలిగిన హైదరాబాదు

ప్రపంచ చరిత్రలో ఎక్కడ చూసినా ప్రజల ప్రాణాల కంటే రాజకీయాల లాభనష్టాలు గొప్పవిగా మారాయి. హైదరాబాదు కూడా మినహాయింపు కాలేదు. 1948లో పోలీస్ యాక్షన్ అనే పేరుతో నడిపిన సైనిక దాడి వాస్తవానికి వేలాది నిరపరాధుల జీవితాలపై నడిచిన రోలర్‌లా మారింది. సెప్టెంబర్ 13, 1948... హైదరాబాద్ చరిత్రలో ఒక మరచిపోలేని గాయం. అయిదు రోజులు మాత్రమే – సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు – కానీ ఆ రోజులు లెక్కలేనన్ని జీవితాలను ఛిన్నాభిన్నం చేశాయి. నిజాం పాలన నుంచి 'స్వాతంత్ర్యం' పేరుతో వచ్చిన భారత సైనిక చర్య, వేలాది మంది ప్రాణాలు తీసింది. కమ్యూనిస్టులు, సాధారణ ప్రజలు – అందరూ బాధితులే. కానీ ఇప్పుడు మతతత్వ రాజకీయాలు చరిత్రను దారుణంగా వక్రీకరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2023లో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ నుంచి ఇంగ్లీషులో వచ్చిన ఈ పుస్తకం, ఇప్పుడు ఎన్.వేణుగోపాల్ అనువాదంతో తెలుగులో కూడా అందుబాటులోకి వచ్చింది – తెలుగు పాఠకులకు ఇది ఒక మైలురాయి, ఎందుకంటే ఇది మన సొంత భాషలో మన చరిత్రను మనకు తిరిగి ఇస్తోంది.

చరిత్ర మలుపు తిరిగిన క్షణాలు 1948 పోలీస్ చర్య

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావడానికి నిరాకరించింది. ఆ సమయంలో నిజాం పాలన కొనసాగుతోంది. భారత ప్రభుత్వం 'ఆపరేషన్ పోలో' అనే కోడ్ పేరుతో సెప్టెంబర్ 13, 1948న సైనిక చర్యకు పూనుకుంది. భారత సైన్యం ఐదు రోజుల్లో హైదరాబాదును విలీనం చేసేసిందని, రక్తపాతం జరగలేదని, దీనిని 'అతి తక్కువ కాలం నడిచిన సంతోషకరమైన యుద్ధం' అని అధికార కథనం చెబుతుంది. ఈ ఐదు రోజుల చరిత్రను 'స్వాతంత్ర్య సాధన'గా మాత్రమే చెపుతుంది. కానీ Remaking History ఈ అబద్ధపు తెరను తొలగించి, మట్టిపైన దాచిన రక్తపు మరకలను బయటపెడుతుంది. ఒక నిర్దిష్ట వర్గంపై ప్రతీకారం తీర్చుకునే క్రూరమైన ఆలోచన ఎలా మొత్తం ముస్లిం సమాజాన్ని 'శత్రువులుగా' మలిచిందో ఈ పుస్తకం బహిర్గతం చేస్తుంది. అఫ్సర్ తన పుస్తకంలో ఆ ఐదు రోజుల బీభత్సం గురించి, ఆ తర్వాత నెలకొన్న పరిస్థితుల గురించి సామాన్య ప్రజల అనుభవాలను నమోదు చేశారు. అధికారిక రికార్డులు చెప్పని వేల మంది ప్రజల బాధలను, హింసను, వేదనను ఆయన తన పరిశోధనలో చూపించారు. 'పోలీస్ చర్య' అనేది కేవలం ఒక రాజ్య వ్యవస్థను అణచివేసే చర్యగా కాకుండా, అది ముస్లింల అణచివేతగా ఎలా మారిందో, దాని వల్ల వేల మంది ఎలా ప్రాణాలు కోల్పోయారో ఆయన ప్రత్యక్ష సాక్షుల కథనా లతో వివరించారు. ఈ క్రమంలో, అనేక కమ్యూనిస్ట్ కుటుంబాలు అల్లర్ల బారినపడి తీవ్రంగా నష్టపోయాయి. అఫ్సర్ ఈ పుస్తకంలో కేవలం పత్రాలకే పరిమితం కాకుండా, వీధుల్లో తిరిగి, గ్రామాల్లోకి వెళ్లి, 1948 హింసను ప్రత్యక్షంగా చూసిన సాక్షుల వాక్కులను రికార్డు చేశారు. బుర్రకథల రూపంలో ప్రతిఘటన చేసిన కమ్యూనిస్టు కళాకారుల గాథలు, భయంతో వలస వెళ్లిన కుటుంబాల అనుభవాలు... ఇవన్నీ మనకు ఇక్కడ కనిపిస్తాయి. ఈ పుస్తకం Hyderabad చరిత్రను 'ప్రజల చూపుల్లోంచి' మళ్లీ రాసింది.

సుందర్‌లాల్ కమిటీ రిపోర్ట్ – దాచి పెట్టిన నిజాలు

1948లోనే జవహర్‌లాల్ నెహ్రూ నియమించిన సుందర్‌లాల్ కమిటీ వేలాది ముస్లింల హత్యలు, దోపిడీలు, స్త్రీలపై లైంగిక దాడులు జరిగాయని నమోదు చేసింది. కానీ ఈ రిపోర్ట్ దశాబ్దాలపాటు 'జాతీయ ప్రయోజనం' పేరిట తాళం వేసి దాచిపెట్టారు. 2013లోనే ఇది బయటకు వచ్చింది. అఫ్సర్ ఈ రిపోర్టును, ఇతర డాక్యుమెంట్లను ఆధారంగా తీసుకుని, రాజకీయాలు ఎలా వాస్తవాలను మరుగుపరుస్తాయో చూపిస్తారు.

ఈ పుస్తకం హృదయానికి హత్తుకునేలా ఉంది ఎందుకంటే, ఇది రాజకీయ నాయకుల కథ కాదు – సాధారణ ప్రజల కథ. ప్రపంచంలో ఎక్కడైనా, రాజకీయ స్వార్థాల కోసమే సైనిక చర్యలు జరుగుతాయి, ప్రజల శ్రేయస్సు కోసం కాదు. ఆ సమయంలో వాస్తవాలు దాచబడతాయి, కానీ బాధితుల నోటి నుంచే కొన్ని నిజాలు బయటకు వస్తాయి. అఫ్సర్ ఈ కోణాన్ని ఎంచుకుని, హైదరాబాద్ ముస్లింల జీవితాలను, వారి కలలను, వారి నష్టాలను రికార్డు చేశారు. ఇది ఒక రాజ్యం అణచివేత కథ మాత్రమే కాదు – మానవత్వం మీద రాజకీయాలు పడిన నీడ కథ.

ప్రజల శ్రేయస్సు ముసుగులో హింస

ప్రపంచ చరిత్రలో ఎన్నో సైనిక చర్యలు 'ప్రజల మంచి' పేరుతో జరిగాయి, కానీ వెనుక రాజకీయ స్వార్థాలే ఉంటాయి. 1948లో హైదరాబాద్‌లో జరిగిన 'పోలీసు చర్య' (ఆపరేషన్ పోలో) కూడా అంతే. నెహ్రూ నాయకత్వంలోని భారత ప్రభుత్వం నిజాం పాలనను అంతం చేయడం పేరుతో సైనిక దాడి చేసింది. కానీ ఇది కేవలం రాజ్య వ్యవస్థ అణచివేత కాదు – ముస్లింల మీద దాడి రూపంలో మారింది. వేలాది మంది చనిపోయారు, కమ్యూనిస్టు కుటుంబాలు, రైతులు, వృత్తిదారుల కుటుంబాలూ ఛిన్నాభిన్న మయ్యాయి, ఎంతో మంది వలస వెళ్లిపోయారు. మిగిలినవారు నరకాన్ని అనుభవించారు. సైనిక చర్యల వెనుక ఎప్పుడూ రాజకీయ స్వార్థాలు దాగి ఉంటాయి. వాస్తవాలు ఎప్పుడూ వెలుగు చూడవు. కానీ, ఆ రాజకీయ క్రీడలో నలిగిపోయేది మాత్రం సామాన్య ప్రజలే. రోహింగ్యాలు, ముస్లింల కష్టాలు, యూదుల నరకయాతన, ఇలా ప్రపంచంలోని మైనారిటీలందరి కథల్లోనూ ఒక ఉమ్మడి బాధ ఉంటుంది. అది అధికారిక చరిత్రలో అదృశ్యమైన, అణచివేయబడిన సామాన్యుల గొంతుక. అఫ్సర్ పుస్తకం ఈ గొంతుకను బలంగా వినిపిస్తుంది.

ప్రభుత్వ నివేదికలు, రాజకీయాల వల్ల చరిత్ర ఎలా వక్రీకరించబడిందో ఈ పుస్తకం స్పష్టంగా చూపిస్తుంది. ఉదాహరణకు, 1948లో హైదరాబాద్‌పై జరిగిన హింసలో వేల మంది సామాన్య ముస్లింలు బలయ్యారు. అయితే, అధికారిక చరిత్రలో ఈ హింసను పట్టించుకోలేదు, లేదా తక్కువ చేసి చూపించారు. అదే సమయంలో, ఈ సైనిక చర్యకు మతపరమైన రంగు పులిమి, దానిని మత యుద్ధంగా చిత్రీకరించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఈ విధమైన తప్పుడు ప్రచారాలను అఫ్సర్ తిప్పి కొట్టారు. ఇటీవలి చర్చల్లో, బీజేపీ 'హైదరాబాద్ లిబరేషన్ డే'ను హిందూ ఉద్యమంగా వక్రీకరించడం గురించి కూడా విమర్శలు వచ్చాయి – ఇది హిందూ–ముస్లిం ఉద్యమం కాదు, రాజకీయ శక్తుల మధ్య పోరాటమని విశ్లేషకులు చెబుతున్నారు.

అఫ్సర్ ఈ పుస్తకంలో చెప్పేది ఇది మరో 'విభజన' లాంటిది. 1947లో భారత–పాకిస్తాన్ విభజనలో ఎన్ని రక్తపు మరకలు పడ్డాయో, ఇక్కడా అంతే. కానీ ఈ చరిత్రను మాట్లాడడానికి కూడా స్థలం లేదు. రాజకీయాలు దాన్ని మత రాజకీయాల రంగు పూసి, ముస్లిం వ్యతిరేకతగా మార్చేశాయి. 1998లో బీజేపీ ఈ చరిత్రను మళ్లీ గుర్తు చేసి, హిందూ మత రాజకీయాలకు ఉపయోగించింది. అఫ్సర్ దీన్ని ప్రశ్నిస్తూ, వక్రీకరణలను బయటపెట్టారు.

బాధితుల నుంచి వచ్చిన నిజాలు

ప్రపంచంలో ఎక్కడైనా, సైనిక చర్యలు ప్రజల శ్రేయస్సు కోసం జరుగుతాయని అనుకోవడం ఒక భ్రమ మాత్రమే. అవి ఎప్పుడూ రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాలకు అనుగుణంగానే జరుగుతాయి. అలాంటి సమయాల్లో వాస్తవాలు చీకట్లోనే మిగిలిపోతాయి – అధికారిక కథనాలు వాటిని మరుగుపరుస్తాయి. కానీ, బాధితుల గాయాల నుంచి, వారి కథల నుంచి మాత్రమే కొన్ని నిజాలు వెలుగులోకి వస్తాయి. అఫ్సర్ ఈ పుస్తకంలో అదే చేశారు. సర్కారీ దస్తావేజులు, రికార్డులతో పాటు, సాధారణ ప్రజలతో మాట్లాడి, వారి ప్రత్యక్ష అనుభవాలను రికార్డు చేశారు. ఉదాహరణకు, అబ్దుల్ కుద్దూస్ సాహెబ్ లాంటి వ్యక్తులు – ముహర్రం పాటలు పాడేవారు – పోలీసు చర్య తర్వాత వారి సంస్కృతి ఎలా నాశనమైందో చెప్పారు. "అది మాకు ఒక పీడ కలలాంటిది, ప్రతి ముస్లిం శత్రువుగా మారాడు" అని ఆయన గుర్తు చేసుకున్నారు.

ఈ హింస తర్వాత హైదరాబాద్ సాహిత్యం, సంస్కృతి ఎలా మారాయో పుస్తకం వివరిస్తుంది. హైదరాబాద్ 'తెహ్జీబ్' (సంస్కృతి)ను – హిందువులు, ముస్లింలు కలిసి ఉండే సాంస్కృతిక ఐక్యతను – గుర్తు చేస్తుంది. రజియా బేగం లాంటి సాక్షులు ."ఆ ఐదు రోజుల హింస మా జీవితాలను ఛిన్నాభిన్నం చేసింది, మా రోజువారీ 'తెహ్జీబ్'ని దూరం చేసింది. సాధారణ ముస్లింలు హింసకు బలయ్యారు, యువ ముస్లిం యువతులు సందేహాస్పదులుగా మారారు, ఇంటిని వదిలి పారిపోయారు" అని చెబుతారు. ఈ కథలు చదివితే, రాజకీయ స్వార్థాలు ప్రజల జీవితాలను ఎలా నాశనం చేస్తాయో హృదయం ద్రవిస్తుంది.

మరుగునపడిన సంస్కృతి

హైదరాబాదీ తెహజీబ్ 1948కి ముందు, హైదరాబాద్‌లో ఒక ప్రత్యేకమైన 'హైదరాబాదీ ఇమాజినరీ' ఉండేదని అఫ్సర్ అంటారు. ఈ సంస్కృతిలో హిందువులు, ముస్లింలు కలిసిమెలిసి జీవించేవారు. హిందూ రచయితలు ఉర్దూలో రాసేవారు, ముస్లింలు తెలుగులో కవిత్వం చెప్పేవారు. ఈ పరస్పర గౌరవం, సౌభ్రాతృత్వం 'పోలీస్ చర్య' తర్వాత పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ పుస్తకం ఆ నాటి సహజీవనానికి అద్దం పడుతూ, మతతత్వ రాజకీయాలు దానిని ఎలా నాశనం చేశాయో వివరిస్తుంది.

అఫ్సర్ యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో బోధకుడు, తెలుగు కవి, ఈ పుస్తకంలో ముస్లిం గుర్తింపును మతం దాటి, సామాజికంగా చూస్తారు. చరిత్రను మరచిపోతే, అది మళ్లీ పునరావతమవుతుంది అనే వాస్తవాన్ని ఇక్కడ మనకు గుర్తు చేస్తుంది. ఇటీవలి చర్చల్లో, రజాకార్ల హింస గురించి మూవీలు (Razakar వంటివి) వచ్చినా, అఫ్సర్ పుస్తకం సమతుల్య దృక్పథాన్ని ఇస్తుంది – అన్ని వైపుల నుంచి కథలు చెబుతుంది.

అందుకే, ఈ పుస్తకం కేవలం చరిత్ర రచన కాదు. అది ఒక జాతి, సంస్కృతి, నాగరికత కోల్పోయిన విషాదాన్ని, వారి భవిష్యత్తు కలలు ఎలా ఛిన్నాభిన్నం అయ్యాయో చెప్పే ఒక హృదయ విదారక కథనం. ఇది మనసులను కదిలించే మానవీయ గాథ.

Remaking History కేవలం గతాన్ని తిరిగి రాయడం కాదు, వర్తమానంలో మనం చరిత్ర నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలను గుర్తు చేస్తుంది. రాజకీయ స్వార్థాలకు మతం, జాతీయవాదం అనే ముసుగులు ఎలా వేస్తారో, దాని ఫలితంగా సామాన్య ప్రజలు ఎలా నష్టపోతారో ఈ పుస్తకం స్పష్టంగా చెబుతుంది.

కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ నుంచి 2023లో ఇంగ్లీషులో వచ్చిన ఈ పుస్తకం, చరిత్ర రచనలో మైలురాయి. అఫ్సర్ దీన్ని 1998లోనే ఆలోచించారు, రాజకీయ వక్రీకరణలను ప్రశ్నించడానికి. ఇప్పుడు తెలుగులో ఎన్. వేణుగోపాల్ అనువాదంతో వచ్చింది. తెలుగు చరిత్ర పుస్తకాలకు పెరుగుతున్న ఆదరణలో మరో మేలుమలుపు. ఇది కేవలం హైదరాబాద్ కథ కాదు– ప్రపంచవ్యాప్తంగా మైనారిటీల బాధలకు అద్దం పడుతుంది. చరిత్రను మళ్లీ రాయడం అంటే, మరచిపోయిన గొంతులకు జీవం పోయడం. రాజకీయ స్వార్థాలు ఎన్ని దాచినా, బాధితుల నిజాలు ఒకరోజు వెలుగు చూస్తాయి. Remaking History అలాంటి వెలుగు. ఈ రోజుల్లో మైనారిటీలు ఎక్కడైనా ఇలాంటి దుస్థితి ఎదుర్కొంటున్న సమయంలో, ఈ పుస్తకం మనకి ఒక పెద్ద పాఠం చెబుతుంది. 'చరిత్రని అధికారాలు వక్రీకరిస్తే, బాధితుల వాక్కే నిజమైన పాఠం' అని.

– కృష్ణ కానూరి
79813 05779



సుద్దాల అశోక్ కావ్యగానం (ఫైల్ ఫోటో)



జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన చిన్నారి చిత్రకారులకు అభినందనలు

ఆధిపత్యాన్ని ప్రతిఘటించిన జాషువా కావ్యగానం

జాషువా సాంస్కృతిక వేదిక విజయవాడ వారి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28న మహాకవి, నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి ఎం.బి.విజ్ఞానకేంద్రం ఆడిటోరియంలో ఉత్తేజకరంగా జరిగింది. 'జాషువా కావ్యగానం' పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసిద్ధ కవి, విమర్శకుడు డా॥ కోయి కోటేశ్వరరావు ప్రధానవక్తగా ప్రసంగించారు. ప్రసిద్ధ గాయకుడు పి.వి.రమణ 'జాషువా కావ్యగానం' చేసి ప్రేక్షకుల్లో ఉద్వేగం నింపారు. రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్, ప్రజా కవి జాషువా ఆశించిన సమానత్వం ప్రభుత్వ జి.వోల్లోనే ఉందని, అణగారిన ప్రజల జీవితాల్లో సమానత్వం లేదన్న కోయి కోటేశ్వరరావు మాటలు ప్రేక్షకుల్లో ఆలోచనలు రేకెత్తించాయి. రమణ గానం చేసిన ప్రసిద్ధ సాహితీవేత్త తెలకపల్లి రవి రాసిన 'జాషువా జాషువా' పాట ఆద్యంతం ప్రేక్షకులను ఉత్తేజపరిచింది. పాట మధ్యలో జాషువా రాసిన 'కుల మతాలు గీచుకొన్న గీతలు జొచ్చి/ పంజరాన గట్టుబడను నేను/ నిఖిల లోకమెట్లు నిర్ణయించిన/ నాకు తరుగు లేదు విశ్వనరుడ నేను' వంటి పద్యాలు ప్రేక్షకుల్లో ఉద్వేగాన్ని నింపాయి.

కులసమాజంగా, మత సమాజంగా అనేక వివక్షలతో, అణచివేతలతో సాగుతున్న వర్తమాన భారత వ్యవస్థను గుర్రం జాషువా పద్యాలు నిపవిల్లాంటి ప్రశ్నలతో చీల్చి చెండాడుతూనే ఉన్నాయి. భారతదేశాన్ని నిచ్చెనమెట్ల కులవ్యవస్థతో దుర్మార్గమైన సామాజిక అణచివేతకు గురిచేసిన మనువాద భావజాలాన్ని 'నాల్గు పడగల హైందవ నాగరాజు' అని ఛీత్కరించాడు జాషువా. మనువాద భావజాలాన్ని నెత్తిన పెట్టుకుని మోస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ తన వంద సంవత్సరాల ఉత్సవాలను పెద్దయెత్తున జరుపుకుంటూ దేశప్రజల్లో మతోన్మాదాన్ని చొప్పిస్తుంది. ప్రజల్లో చీలికలు తెస్తూ విద్వేషాన్ని నూరిపోస్తుంది. ఈ ప్రమాదాన్ని తక్షణమే పురోగామి శక్తులు ఎదుర్కోవాలి. అందుకు సాంస్కృతిక రంగంలో, భావజాల రంగంలో నేడు పెద్దఎత్తున కృషిచేయవలసిన అవసరం ఉంది.

ఆర్‌ఎస్‌ఎస్ తన ఫాసిస్టు దృక్పథం కారణంగా దేశంలో పలుసార్లు నిషేధానికి గురయింది. అయినప్పటికీ తన సాంస్కృతిక ఆధిపత్యం కారణంగా మన దేశ ప్రజల్ని ఇంకా మోసం చేయగలుగుతుంది. ఈ భావజాలానికి విరుగుడు జాషువా రచనలు. అలాగే బుద్ధుడు, జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే, అంబేద్కర్, నారాయణగురు, పెరియార్, గురజాడ, కందుకూరి వీరేశలింగం, శ్రీశ్రీ, చలం వంటి సాంఘిక, అభ్యుదయ, పురోగామి చైతన్యమూర్తుల బోధనలు, రచనలే శరణ్యం. మన దేశంలో సాంఘిక చైతన్యానికి, ప్రజల మధ్య నెలకొన్న అసమానతల నిర్మూలనకి నడుం కట్టిన ఈ ఆధునిక సంఘసంస్కర్తల ఆలోచనలను ఈ తరానికి చేరవేయాల్సిన అవసరం ఈనాటి ప్రజా రచయితల, సామాజిక కార్యకర్తల ప్రధాన కర్తవ్యంగా మారాలి. ఆర్‌ఎస్‌ఎస్ ఛాందస మనుధర్మ సంస్కృతిని ఎదుర్కొని ప్రజల్లో సమానత్వ సంస్కృతిని, మానవతా వాద దృక్పథాన్ని ప్రచారం చేయాలి. ఆ పని జాషువా సాంస్కృతిక వేదిక వంటి సంస్థలు ఇటీవల చేస్తున్న కార్యక్రమాల తరహాలో చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రాల ఆధ్వర్యంలో పలు జిల్లాలో ప్రసిద్ధ సినిమా పాటల రచయిత సుద్దాల అశోక్‌తేజతో 'శ్రమగానం' కార్యక్రమాలు జరిగాయి. తిరుపతి నగరంలోనూ శ్రామిక సంస్కృతిని గానం చేయడం ఒక గొప్ప పరిణామం. ఆధిపత్య సంస్కృతి, కార్పొరేట్ సంస్కృతి దేశ యువతను నిర్వీర్యం చేస్తున్న నేపథ్యంలో శ్రమ సంస్కృతికి పెద్దపీట వేసేలా శ్రామిక కావ్యగానం చేయించడం ఎంబి విజ్ఞాన కేంద్రాలు, జాషువా సాంస్కృతిక వేదిక చేస్తున్న విలక్షణ కృషి.

అలాగే ఇటీవల మరో ప్రసిద్ధ ప్రజాకవి జయరాజు చేత 'ప్రకృతి గానం' చేయించడం మరో విలక్షణ కార్యక్రమం. అత్యంత విలువైన ప్రకృతి వనరులను కొల్లగొడుతున్న కార్పొరేట్ సంస్కృతిని దునుమాడుతూ సాగే జయరాజు 'ప్రకృతిగానం' ఈనాటి అత్యంత అవసరమైన సాంస్కృతిక కార్యక్రమం. జయరాజు తన ప్రకృతి కావ్యగానంలో ప్రజలకీ ప్రకృతికీ ఉన్న అవినాభావ సంబంధాల్ని అత్యంత సరళంగా, సహజంగా తన పాటల్లో ఆలపించి ప్రజల్లో ఆలోచనలు రేకెత్తిస్తున్నారు. ఎంతో ప్రయోజనకరంగా సాగే ఈ ప్రకృతిగానం కార్యక్రమాన్ని ఎంతో ప్రోత్సహించాల్సిన అవసరముంది. మరింత మంది గాయకులు, కళాకారులు జయరాజు అందించే ఈ విలక్షణ కార్యక్రమాన్ని అందిపుచ్చుకుని ముందుకు తీసుకువెళ్లాలి.

రాబోయే రోజుల్లో ప్రసిద్ధ ప్రజాగాయకుడు గోరటి వెంకన్న చేత 'సామాజిక గానం' పేరుతో సమానత్వ సంస్కృతికి పాదులు వేసేలా, సామాజిక చైతన్యాన్ని పెంపొందించేలా ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించడానికి విజ్ఞాన కేంద్రాలు, జాషువా సాంస్కృతిక వేదికలు సన్నద్ధం అవుతున్నాయి.

సెప్టెంబర్ 28న జరిగిన 'జాషువా కావ్యగానం' విలక్షణ పద్ధతిలో సమానత్వ సంస్కృతికి, శ్రమ సంస్కృతికి అద్దం పట్టే ఆలోచనా ధారలను ప్రేక్షకులకు అందించింది. రమణ పాటలు, కోయి కోటేశ్వరరావు జనరంజక ప్రసంగం, మధ్యలో తెలుగుభాషా వికాసం, అభ్యుదయ, పురోగామి సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రదర్శించిన బాలబాలికల శాస్త్రీయ నృత్యాల్లో గురజాడ, గుర్రం జాషువా, కందుకూరి, శ్రీశ్రీ తదితర మహారచయితల, సంఘసంస్కర్తల ప్రస్తావనతో సాగిన కార్యక్రమం గొప్ప సాంస్కృతిక ఉత్సవాన్ని తలపించింది. ఇదే తరహాలో ప్రతి పట్టణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తే, ముఖ్యంగా బాల బాలకలను, యువతను భాగస్వాములను చేస్తే రాబోయే తరాలకు సమానత్వ, శ్రామిక సంస్కృతిని సమున్నతంగా అందించగలమనడంలో సందేహం లేదు.

– వొరప్రసాద్
94900 99059

పరిపరి విధాలుగా ...

ఒక పూర్వపు అవస్థ మళ్లీ పురుడు బోసుకుంటుంది
లోలోన అది నిప్పులా
కొంచం కొంచంగా రాజుకొంటూంది
ఎంతకీ ఎడతెగని బంధంలా
దుఃఖము మళ్లీమళ్లీ పెనవేసుకొంటుంది
దూరం జరగటం ఎలాగో కుదరదు కాని..
కాసింత ఉపశమనం కోసమే
ఇంత పెనుగులాట
కాస్తంత ఆటవిడుపు కొరకే
ఇంత వెతుకులాట
పక్క కుదరదు కంటికి కునుకు పట్టదు
అవిరామ శిరోవేదనదేదో ఆకాశమంత భారం
ఉరుము మెరుపుల భీతావాహం
ప్రవాహవేగంలో పడిపోయిన గాలిపటం
రెండు విరిగిన రెక్కల్ని రెండు తీరాలకు చాచి
గగనానికి గురిపెట్టిన సీతకోకచిలుక
చిరిగిన తెరచాపతో నావ
ఏ ఒడ్డుకు చేర్చగలదు?
బాగుపడటం, బయటపడటం
ఇక ప్రశ్నార్థకం
జీవితం సుడిగాలిలో దీపమైతే
అడుగడుగూ సుడిగుండమే కదా!
ఇన్ని బాధల సమస్యల సమాహారం బతుకు
ఇన్నిన్ని అవరోధాల అగాధాలు
ఒక ప్రయాణం
సఫలమవ్వని ప్రయత్నాలన్నీ
ఒట్టి పరాజితుని ఆత్మకథలు
చరిత్రకెక్కని సత్యాలు
బేతాళుడు వందొకటోసారి కూడా
తిరిగి చెట్టెక్కుతాడు
అలసిన విక్రమార్కుడు
వేయి ముక్కలయ్యే తల
ఎవరిదో తెలియక
తికమక పడుతుంటాడు
నేలజారిన వెన్నెల్ని దోసిళ్లతో
కళ్ళల్లో వంపుకోవటం కుదరదు
అయినా ఏదీ ఊరుకోదు
జీవితం ఒక ప్రశ్న
అనేక సమాధానాలయితే బాగుణ్ణు
కానీ
అనేక ప్రశ్నలకి ఒకే సమాధానంలా ఉంది
అయినా ఎంతసేపు కూలుతున్న ఆకాశాన్ని నెత్తిన మోస్తాం
తెగిపడిన రెక్కల్లాంటి జ్ఞాపకాలు
బరువెక్కుతున్న క్షణాలు ...
జీవితం పరిపరి విధాలుగా విరబూస్తున్న
దుఃఖ సంకలనం!

– లోసారి సుధాకర్
99499 46991

వదంతులు నమ్మొద్దు : టిటిడి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో :
తిరుమల తిరుపతి దేవస్థానంపై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మొద్దని, టిటిడి వెబ్‌సైట్‌ను ఫాలో కావాలని టిటిడి కోరింది. వృద్ధుల దర్శన సమయంపై క్లారిటీ ఇచ్చింది. టిటిడి కొత్త టెక్నాలజీ, యాత్రికులకు రిలీఫ్ ముఖ్యంగా వయో వృద్ధుల దర్శనం గురించి జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని టిటిడి ఖండించింది. అలాంటి దుష్ప్రచారాన్ని నమ్మొద్దని శ్రీవారి యాత్రికులకు విజ్ఞప్తి చేసింది. తిరుమలలో వయో వృద్ధుల దర్శనం గురించి తప్పుదోవ పట్టించేలా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. రోజూ వేయి మంది వయోవృద్ధులు, వికలాంగులకు దర్శనం కల్పిస్తామని, ఈ దర్శనాలకు సంబంధించిన ఆన్‌లైన్ కోటాను మూడు నెలల ముందుగానే విడుదల చేస్తామని తెలిపింది.

ఈ టికెట్ పొందిన యాత్రికులకు రూ.50 లడ్డూ ఉచితంగా ఇస్తున్నట్లు వివరించింది. తిరుమల నంబి ఆలయం వద్దనున్న సీనియర్ సిటిజన్/పిహెచ్‌సి లైన్ ద్వారా ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు గంటలకు వారిని శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారని తెలిపింది.

కృత్రిమ మేధ.. ఉపాధ్యాయులకు సాటిరాదు

- కెవిఆర్, జయలక్ష్మి ట్రస్ట్ ఉపాధ్యాయ పురస్కార సభలో వక్తలు
- 54 మంది ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-గుంటూరు
కృత్రిమ మేధా వంటి సాధనాలు ఎన్ని వచ్చినా ఉపాధ్యాయులకు సాటి రావని, ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తన తల్లిదండ్రుల పేరుతో స్థాపించిన కెవిఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉత్తమ ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డులను అందజేశారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమానికి కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా హాజరైన ఉన్నత విద్యామండలి వైస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ రత్నషీలామణి మాట్లాడుతూ తల్లిదండ్రులు కొందరు ర్యాంకుల కోసం పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నారని, మరికొందరు తమ పిల్లలను పట్టించుకునే పరిస్థితి ఉండట్లేదని అన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల పాత్ర మరింత పెరిగిందని వివరించారు. ఎఐ వంటి సాధనాలు బోధన మాత్రమే చేస్తాయని, కానీ చదువుతోపాటు విలువలనూ నేర్పించడం ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ కోవిడ్ సమయంలో విద్యార్థులు సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ క్లాసులు విన్నారని, తర్వాత జరిగిన ఒక అధ్యాయనంలో విద్యార్థుల్లో అనేక మార్పులు వచ్చాయని, ముఖ్యంగా అనేక మానసిక సమస్యలు వచ్చాయని తేలిందని వివరించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాబోయే తరాలను ఊ... కొట్టేవారిగా కాకుండా ప్రశ్నించేవారిగా, సమాజాన్ని మార్చే వారిగా తీర్చిదిద్దాలని కోరారు. పిల్లల వైద్యులు డాక్టర్ ఆలా వెంటేశ్వర్లు మాట్లాడుతూ హేతుబద్ధంగా ఆలోచిస్తూ, సామాజిక స్పృహతో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై దేశంలో పలుచోట్ల దాడులు జరుగుతున్నాయని, ఈ తరుణంలో వారికి పౌర సమాజం అండగా ఉండాలని అన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ట్రస్ట్ ద్వారా గుర్తిస్తూ వారిని గౌరవించడం బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అనంతరం 54 మంది ఉత్తమ ఉపాధ్యాయులను జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్, కెవిఆర్, జయలక్ష్మి చిత్రపటాల వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వ సురేష్, రాష్ట్ర నాయకులు కె శ్రీనివాసరావు, విజిఎస్ పబ్లిషర్స్ అధినేత ఎస్ రామారావు, ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ కె విజయకుమారి పాల్గొన్నారు.


పురస్కారం అందుకున్న ఉపాధ్యాయులతో ప్రొఫెసర్ రత్నషీలామణి, ఎమ్మెల్సీ గోపి మూర్తి, కెఎస్ లక్ష్మణరావు


కోలాటాన్ని తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఘనంగా విజయనగరం ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి
విజయనగరం ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ సూచికగా పైడితల్లమ్మ ఆలయం నుంచి కోట వరకు భారీ ప్రదర్శన (శోభాయాత్ర) నిర్వహించారు. యాత్రను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, ఎంఎస్‌ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కోట వద్ద ప్రముఖులు ఆశీనులై కళారూపాలను తిలకించారు. ఈ ర్యాలీలో స్వాగత శకటం, రోలర్ స్కేటర్లు, పైడితల్లమ్మ కలశాలు, తప్పెటగుళ్లు, థింసా నృత్యం, పులి వేషాలు, విచిత్ర వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేరళ వాయిద్యాలు, కర్రసాము, అడుగుల బొమ్మలు, కొమ్ము కోయ డ్యాన్స్, బిందెల డ్యాన్స్, గరగల డ్యాన్స్, చెక్క భజన, గంగిరెద్దులు, జముకుల బృందం, ఎన్‌సిసి కేడెట్ల మార్చ్, కోలాటం అలరించాయి. క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధి హామీ, ఎస్‌హెచ్‌జి సభ్యులు, తదితరులు ఇందులో భాగస్వాములయ్యారు. రెండు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలు, జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు, సాహితీ పరిమళాలకు అద్దంపట్టేలా సాగుతున్నాయి. మొత్తంగా 11 వేదికల్లో వివిధ కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సాహితీ సభలు, కవి సమ్మేళనాలు, మెగా మ్యూజికల్ నైట్, నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఉత్సవ ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్, జెసి ఎస్.సేధు మాధవన్, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో దారుణం

- తల్లిని అతిదారుణంగా హత్య చేసిన కుమారుడు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (వైఎస్ఆర్ జిల్లా)
వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో దారుణం చోటుచేసుకుంది. కన్నతల్లిని కుమారుడు గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. తల్లి ప్రాణం తీసిన అనంతరం ఎలాంటి బాధ, బెరుకు లేకుండా ఇంట్లో కూర్చుని తన సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ రాక్షసానందం పొందాడు. ఈ సంఘటన ప్రొద్దుటూరులోని శ్రీరామ్ నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయ్‌భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతులు శ్రీరామ్‌నగర్‌లో నివాసముంటున్నారు. వీరికి యశ్వంత్ కుమార్‌రెడ్డి అనే కుమారుడు ఉన్నాడు. లక్ష్మీదేవి పట్టణంలోని ఈశ్వర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. యశ్వంత్ మూడేళ్ల కిందట చెన్నైలో బిటెక్ పూర్తి చేసి అనంతరం ఉద్యోగాన్వేషణ కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఖర్చుల కోసం ప్రతి నెలా అతని తల్లి డబ్బులు పంపేవారు. ఇటీవల తల్లికి ఫోన్ చేసి రూ.3 వేలు అడిగితే పంపారు. మరో రూ.10 వేలు కావాలని అడగ్గా డబ్బులు ఇవ్వకపోవడంతో యశ్వంత్ తల్లిపై కోపం పెంచుకున్నాడు. కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరులోని ఇంటికి వచ్చాడు. వచ్చీ రాగానే తల్లితో గొడవకు దిగి దాడి చేశాడు. ఆమె గట్టిగా అరవడంతో ఆ కేకలు విని బెడ్‌రూమ్‌లో ఉన్న తండ్రి విజయ్‌భాస్కర్‌రెడ్డి బయటకు వచ్చే ప్రయత్నం చేయగా ఆయనను యశ్వంత్ రెడ్డి లోపలికి నెట్టేసి గదికి గడియపెట్టాడు. ఆ తరువాత కూరగాయల కత్తితో వెనుక నుంచి తల్లిగొంతు కోశాడు. రక్తపుమడుగులో కొట్టుమిట్టాడుతున్న తల్లిని ఈడ్చుకుంటూ తీసుకెళ్లి బయట పడేశాడు. ఆపై తలుపులు వేసుకుని ఇంట్లో దర్జాగా టివి చూస్తూ సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ రాక్షసానందం పొందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఉపాధ్యాయులకు సాంస్కృతిక పోటీలు

- వచ్చేనెల 8, 9 తేదీల్లో రాష్ట్రస్థాయిలో నిర్వహణ
- నరసరావుపేటలో బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించిన పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగ స్ఫూర్తితో పల్నాడు బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయుల సాంస్కృతిక పోటీలను నవంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో పల్నాడు బాలోత్సవాల అధ్యక్షులు, ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు ఆదివారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తరగతి గదులకే పరిమితం కాకుండా వారిలోని సృజనాత్మకతను వెలికి తీయడం, పిల్లలను అర్థం చేసుకునేలా తీర్చిదిద్దడం కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, దాన్ని అధిగమించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ వచ్చే నెల 8, 9 తేదీల్లో నరసరావుపేటలోని ఎస్‌ఎస్‌ఎన్ కళాశాల ప్రాంగణంలో ఈ పోటీలు ఉంటాయని చెప్పారు. పోటీల గౌరవ సలహాదారుడు, శ్రీకృష్ణ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కొల్లి బ్రహ్మయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా ఒక నాటి విద్యార్థులేనని, ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో కళల ప్రదర్శనకు సమయం లేకపోవడం వంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారని అన్నారు.

పోటీల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి అంజిరెడ్డి, గౌస్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనదలచిన ఉపాధ్యాయులు 9866562260, 9949809821, 9390070555, 9848498714, 9866625339, 9966877574 ఫోన్ నంబర్లను సంప్రదించాలని లేదా palnadubaoltsavam@gmail.com నందు సంప్రదించాలని తెలిపారు. ఈ నెల 26వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని తెలిపారు. దూర ప్రాంతాల నుండి వచ్చేవారికి వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. మొదటి రోజు శాస్త్రీయ నృత్యం, నాటికలు, దేశభక్తి గీతాలు, బుర్రకథలు, ముచ్చటగా మూడు నిమిషాలు పోటీ కార్యక్రమం, 2వ రోజు జానపద నృత్యం, ఏకపాత్రాభినయం, మైమ్, కోలాటం, పద్యాలు, కవితల పోటీలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో పల్నాడు బాలోత్సవాల కమిటీ సభ్యులు ఎం మోహనరావు, ఎం సాంబశివరావు, ఎ భాగేశ్వరిదేవి, నెల్లూరి బ్రహ్మయ్య, కె రామారావు, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.


పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

సిపిసికి హాజరుకానున్న సభాపతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
బార్బడోస్‌లో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకూ నిర్వహించనున్న 68వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ సదస్సు (సిపిసి)కు రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు హాజరుకానున్నారు. సోమవారం ఢిల్లీ నుంచి బార్బడోస్‌కు బయలుదేరనున్నారని సభాపతి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ సూర్యదేవ ప్రసన్న కుమార్ సభాపతి వెంట వెళ్లనున్నారని తెలిపింది. ఈ సదస్సులో కామన్‌వెల్త్ దేశాల్లో చట్ట సభల సభాపతులు తమ అనుభవాలను, ఆలోచనలను పంచుకోవడానికి, చట్ట సభలు ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమకాలీన సమస్యలకు పరిష్కారాలు అన్వేషించడానికి కామన్‌వెల్త్ పార్లమెంటరీ సదస్సు వేదికగా మారనుందని ఈ సందర్భంగా సభాపతి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ శాఖ ప్రతినిధిగా సభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు.. ప్రజాస్వామ్యానికి మద్దతుగా శాసన వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం, పారదర్శకత పెంపొందించడం, ఎన్నికల్లో ఆర్థిక పారదర్శకత, జాతీయ పారమెంట్లు, ప్రాంతీయ, ప్రాదేశిక, వికేంద్రీకృత చట్ట సభలు, అధికారాల విభజన ప్రాముఖ్యత అనే అంశాలపై నిర్వహించే సదస్సుల్లో పాల్గొంటారని వెల్లడించింది.

ఐక్యరాజ్యసమితి శాంతి దినోత్సవం ఎప్పుడు?



-డాక్టర్ నల్లా నరసింహమూర్తి
సీనియర్ లెక్చరర్
పోటీ పరీక్షల ప్రత్యేక నిపుణులు
కురసాలవారి వీధి, అమలాపురం, డా॥ అంబేద్కర్ కోనసీమ జిల్లా.
సెల్ : 9247577501

01. సామ్యవాదం, లౌకికవాదం అనే పదాలను భారత రాజ్యాంగంలో ఎన్నో సవరణ ద్వారా చేర్చారు?
(1) 42 (2) 44 (3) 40 (4) 36

2. ఈ కింది వాటిలో రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు లేని వారెవ్వరు?
(1) లోక్‌సభ సభ్యులు (2) రాజ్యసభ సభ్యులు
(3) ఢిల్లీ, పుదుచ్చేరి శాసన సభల సభ్యులు
(4) రాష్ట్ర శాసనమండలి సభ్యులు

3. అధికరణ 136 ప్రకారం సుప్రీంకోర్టుకు ఉన్న అధికారం?
(1) సివిల్ జూరిస్ డిక్షన్ (2)అప్పిలేట్ జూరిస్ డిక్షన్
(3) స్పెషల్ లీవ్ పిటీషన్ (4) ట్రాన్ఫర్డ్ జూరీ డిక్షన్

4. జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలి పదవీకాలం ఎన్నేళ్లు?
(1) రెండేళ్లు (2)మూడేళ్లు (3) నాలుగేళ్లు (4) ఐదేళ్లు

5. ఐక్యరాజ్యసమితి ఏ రోజును శాంతి దినోత్సవంగా జరుపుకోవాలని తెలిపింది?
(1) మార్చి 21 (2) మే 12
(3) సెప్టెంబర్ 21 (4) నవంబర్ 17

6. భారతదేశపు జాతీయ క్రీడ ఏది?
(1) హాకీ (2) ఫుట్‌బాల్ (3) కబడ్డీ (4) క్రికెట్

7. అంతర్జాతీయ పులుల దినోత్సవం ఎప్పుడు?
(1) జూలై 29 (2) ఆగస్ట్ 20
(3) జూలై 3 (4) జూన్ 23

8..కార్గిల్ విజయ్ దినోత్సవం ఎప్పుడు?
(1) జూలై 3 (2)జూలై 21
(3) జూలై 26 (4) ఆగస్టు 7

9. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం తేదీ?
1. ఆగస్టు 6 2. ఆగస్టు 17
3. మే 5 4. ఆగస్టు 19

10. జాతీయ అభివృద్ధి మండలిని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
(1)1951 (2)1952
(3)1953 (4) 1954

11. ఈ కింది వాటిలో ఆసియా క్రీడలను అత్యధికంగా నాలుగు సార్లు నిర్వహించిన దేశం ఏది?
(1) భారతదేశం (2) దక్షిణ కొరియా
(3) జపాన్ (4) థాయిలాండ్

12. ఎన్నో రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 16వ ఆర్టికల్‌ను సవరించి ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రమోషన్ కల్పించారు?
(1) 95 వ సవరణ బిల్లు (2) 84 వ సవరణ బిల్లు
(3) 85వ సవరణ బిల్లు (4) 91వ సవరణ బిల్లు

13. మొట్టమొదటి రాజ్యాంగ సవరణ జరిగిన సంవత్సరం?
(1) 1950 (2) 1952 (3) 1951 (4) 1953

14. రాజ భరణాల రద్దును ఏ సవరణ ద్వారా చేశారు?
(1) 29వ సవరణ (2) 31 వ సవరణ
(3) 26 వ సవరణ (4) 28 వ సవరణ

15. మినీ రాజ్యాంగ సవరణ అని ఏ సవరణలను పేర్కొంటారు?
(1) 42 వ సవరణ (2) 43 వ సవరణ
(3) 44 వ సవరణ (4) 45 వ సవరణ

16. ఏ ఆర్టికల్ ప్రకారం పార్లమెంట్ భారత రాజ్యాంగాన్ని సవరించడానికి వీలుంటుంది?
(1) 370 (2) 390 (3) 368 (4) 348

17. భారతదేశ రాజ్యాంగంలో ఈ చట్ట సవరణ ద్వారా ప్రాథమిక విధులను పేర్కొన్నది?
(1) 41 (2) 42 (3) 43 (4) 44

18. భారత ప్రభుత్వం వార్షిక పోలియో జాతీయ ఇమ్యునైజేషన్ డే 2022ను ఏ రోజున నిర్వహించింది?
(1) ఫిబ్రవరి 26 (2) ఫిబ్రవరి 28
(3) ఫిబ్రవరి 27 (4) ఫిబ్రవరి 25

19. ఈ దేశం నుండి భారతీయులను తిరిగి తీసుకురావడానికి ఆపరేషన్ గంగ చేపట్టారు?
(1) ఇరాన్ (2) రష్యా (3) అమెరికా (4) ఉక్రెయిన్

20. బ్లాక్ అండ్ చైన్ ఆధారిత డిజిటల్ డిగ్రీలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎక్కడ ప్రారంభించారు?
(1) ఐఐటి ఢిల్లీ (2) ఐఐటి కాన్పూర్
(3) ఐఐటి బొంబాయి (4) ఐఐటి రూర్కి

21. భారతదేశ కేంద్ర కార్యనిర్వాహక అధికారాలన్నీ రాష్ట్రపతికి దక్కుతాయని ఏ ప్రకరణ వివరిస్తుంది?
(1) 52వ ప్రకరణ (2) 53 వ ప్రకరణ
(3) 54 వ ప్రకరణ (4) 55వ ప్రకరణ

22. 17వ లోక్‌సభకు ఎన్నికైన మహిళల సంఖ్య?
(1) 59 (2) 78 (3) 86 (4) 49

23. ఇప్పటివరకు భారతదేశంలో ఎన్ని సార్లు హంగ్ పార్లమెంట్లు ఏర్పడ్డాయి?
1.8. 2.7 3.3 4.9

24. ఈ క్రింది ఏ ప్రకరణ ప్రకారం రాష్ట్రపతి ఉభయ సభలనుద్దేశించి ప్రతి సంవత్సరం పార్లమెంట్ మొదటి సమావేశంలో ప్రసంగిస్తారు?
(1) 87 (2) 82 (3) 75 (4) 72

25. ఆధునిక కాలంలో పార్లమెంటరీ కమిటీలు శాసన వ్యవస్థకు నేత్రాలుగా, చేతులుగా, చెవులుగా కొన్నిసార్లు మేథస్సుగా పనిచేస్తాయని వ్యాఖ్యానించిన రాజనీతి విశ్లేషకులు ఎవరు?
(1) ఉడ్రోవిల్సన్ (2) దామస్‌రీచ్
(3) మారిన్ (4) వై.వి.చవాన్

26. ఉభయ సభల మధ్య బిల్లుల ఆమోదంలో ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించడానికి ఈ కింది ఏ ప్రకరణ ప్రకారం రాష్ట్రపతి ఉభయ సభల సమావేశాన్ని ఏర్పాటుచేస్తారు?
(1) 108 (2) 104 (3) 143 (4)153

27. ఆర్థిక బిల్లును ఎన్ని రోజులు లోపల పార్లమెంటు తప్పనిసరిగా ఆమోదించి తీరాలి?
(1) 75 (2) 65 (3) 55 (4) 45

28. విశ్వాస తీర్మానం ద్వారా అధికారం కోల్పోయిన ప్రధానమంత్రి ఎవరు?
(1) వి.పి.సింగ్ (2) దేవగౌడ
(3) అటల్ బిహారీ వాజ్‌పేయి (4) ఒకటి, రెండు, మూడు

29. లోక్‌సభ నియమావళిలోని సెక్షన్ 121 (1) ప్రకారం సంబంధ పార్టీకి ఎన్నవ వంతు తక్కువ కాకుండా సీట్లు వచ్చినప్పుడే ప్రతిపక్ష హోదా ఇస్తారు?
(1)1/ 10 (2) 2/3 (3) 2/7 (4) 5/10

30. రాష్ట్ర శాసనసభకు పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికలైతే ఎన్ని రోజుల లోపల రాష్ట్ర శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలి?



(1)15 (2) 14 (3) 17 (4) 25

31. స్పీకర్ తన రాజీనామా పత్రాన్ని ఎవరికి పంపిస్తారు?
(1) ప్రధానమంత్రి (2) రాష్ట్రపతి
(3) డిప్యూటీ స్పీకర్ (4) లోక్ సభ సెక్రటరీ జనరల్

32. ఉపరాష్ట్రపతి పదవిని ఏర్పాటు చేయాలని రాజ్యాంగ పరిషత్‌లో ప్రతిపాదించిన వారు ఎవరు?
(1)హెచ్‌వి కామత్ (2) డాక్టర్ రాజేంద్రప్రసాద్
(3) కెఎం మున్షీ (4) గోపాలస్వామి అయ్యంగార్

33. అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు పార్లమెంట్ చట్టరీత్యా ఈ కింది ప్రకరణ ప్రకారం రాష్ట్ర విధాన సభల గడువు కాలాన్ని ఒక సంవత్సరం చొప్పున పొడిగించొచ్చు ?
(1) 171 (2) 17 2 (1) (3) 183(1) (4) 182

34. ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఓటు హక్కు వయస్సు 21 నుండి 18 సంవత్సరాలకు తగ్గించారు?
(1) 61 వ రాజ్యాంగ సవరణ చట్టం
(2) 63 వ రాజ్యాంగ సవరణ చట్టం
(3) 67 వ రాజ్యాంగ సవరణ చట్టం
(4) 69 వ రాజ్యాంగ సవరణ చట్టం

35. కేంద్ర సమాచార కమిషన్ తన వార్షిక నివేదికను ఎవరికి సమర్పిస్తుంది?
(1) రాష్ట్రపతి (2) కేంద్ర ప్రభుత్వం
(3) పార్లమెంట్ (4) సమాచార ప్రచారాల మంత్రిత్వ శాఖ

36. ప్రధాన సమాచార కమిషనర్, ఇతర సమాచార కమిషనర్లను ఎవరు నియమిస్తారు?
(1) కేంద్ర ప్రభుత్వం (2) రాష్ట్రపతి (3) ప్రధానమంత్రి (4) కేంద్ర సమాచార ప్రచార శాఖా మంత్రి

37. మైనారిటీ హక్కుల దినోత్సవం ఎప్పుడు?
(1) డిసెంబర్ 13 (2) డిసెంబర్ 18
(3) డిసెంబర్ 2 (4) జనవరి 21

38. లోక్‌పాల్, లోకాయుక్త బిల్లు ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
(1) 2014 జనవరి 16 (2) 2014 అక్టోబర్ 2
(3) 2015 జనవరి 1 (4) 2015 ఏప్రిల్ 1

39. మన దేశంలో మొదటిసారిగా లోకాయుక్త వ్యవస్థను ఏర్పాటు చేసిన రాష్ట్రం ఏది?
(1) ఒడిస్సా (2) కర్ణాటక (3) ఆంధ్రప్రదేశ్ (4) తమిళనాడు

40. లోకాయుక్త పదవీకాలం ఎంత?
(1) ఐదు సంవత్సరాలు (2) నాలుగు సంవత్సరాలు
(3) ఆరు సంవత్సరాలు (4) రెండు సంవత్సరాలు

41. జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ ఏ సంవత్సరంలో అమల్లోకి వచ్చింది?
(1) 2001 (2) 2002 (3) 2000 (4) 2004

42. వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ చైర్మన్, సభ్యులు పదవీ కాలాన్ని ఇతర సర్వీస్ విషయాలను ఎవరు నిర్ణయిస్తారు?
(1) పార్లమెంట్ (2) రాష్ట్రపతి
(3) ప్రధానమంత్రి (4) వెనుకబడిన తరగతుల మంత్రిత్వ శాఖ

43. 101వ రాజ్యాంగ సవరణ వస్తువు సేవల పన్ను మండలి ఏర్పాటును సూచిస్తుంది. ఈ సవరణ ద్వారా రాజ్యాంగంలో ఈ కింది ఏ అధికరణాన్ని కొత్తగా చేర్చారు?
(1) 279 (2) 279 (ఎ) (3) 251 (4) 282(ఎ)

44. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుల సంఖ్యను ఎవరు నిర్ణయిస్తారు?
(1) రాష్ట్ర గవర్నర్ (2) రాష్ట్రపతి
(3) పార్లమెంట్ (4) రాష్ట్ర అసెంబ్లీ

45. ఎన్నికల సంఘాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
(1) 1950 (2) 1959 (3) 1968 (4) 1962

46. ప్రధాన ఎన్నికల కమిషన్, ఇతర ఎన్నికల కమిషనర్ల జీతభత్యాలను ఎవరు నిర్ణయిస్తారు?
(1) పార్లమెంట్ (2) రాష్ట్రపతి
(3) వేతన సంఘం రాష్ట్రపతి ఆమోదంతో (4) రాజ్యాంగం

47. దేశంలో మొట్టమొదటి పట్టణాభివృద్ధి సంస్థ ఏది?
(1) బొంబాయి (2) కలకత్తా (3) ఢిల్లీ (4) మద్రాస్

48. భారత రాజ్యాంగంలో 12వ షెడ్యూల్లో ఉన్న ఎన్ని విధులను పట్టణ స్థానిక సంస్థలకు నిర్దేశించారు?
(1) 10 (2) 16 (3) 12 (4) 18

49. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ తాత్కాలికి చైర్మన్‌ను ఎవరు ఎన్నుకుంటారు?
(1) అధ్యక్షులు (2) రాష్ట్ర గవర్నర్
(3) ముఖ్యమంత్రి (4) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

50. జాయింట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వేదికను ఎవరికి సమర్పిస్తుంది?
(1) రాష్ట్ర గవర్నర్లకు (2) రాష్ట్రపతికి
(3) ఆయా రాష్ట్ర అసెంబ్లీలకు (4) పార్లమెంట్‌కు

51. జాతీయ మైనార్టీ కమిషన్ చైర్మన్, సభ్యులను ఎవరు నియమిస్తారు?
(1) రాష్ట్రపతి (2) సుప్రీంకోర్టు (3) కేంద్ర ప్రభుత్వం (4) పార్లమెంట్

52. భారత్‌లో అత్యధికంగా మైనార్టీలు కలిగి ఉన్న రాష్ట్రం ఏది?
(1)ఉత్తర ప్రదేశ్ (2) కర్ణాటక (3) అస్సాం (4) కేరళ

53. పార్లమెంట్ ద్వారా జాతీయ మైనార్టీ కమిషన్‌కు చట్ట ప్రతిపత్తి ని ఏ సంవత్సరంలో కల్పించారు?
(1)1990 (2) 1992 (3) 1995 (4) 1997

54. ప్రధాన సమాచార కమిషనర్, ఇతర సమాచార కమిషనర్ల పదవీ కాలం ఎంత?
(1) ఆరు సంవత్సరాలు (2) ఐదు సంవత్సరాలు
(3) మూడు సంవత్సరాలు
(4) కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినంత కాలం

55. కేంద్ర నిఘా సంఘం చైర్మన్; సభ్యులను ఎవరు తొలగిస్తారు?
(1) కేంద్ర ప్రభుత్వం (2) పార్లమెంట్ (3) రాష్ట్రపతి (4) సుప్రీంకోర్టు

56. కేంద్ర నిఘా సంఘం ఈ క్రింది ఏ కమిటీ సిఫార్సుతో ఏర్పడింది?
(1) సంతానం కమిటీ (2) వర్మ కమిటీ
(3) బి.శుభ పతరెడ్డి కమిటీ (4) ముకుల్ శర్మ కమిటీ

57. భాషాపరమైన మైనార్టీ వర్గాల కోసం ప్రత్యేక అధికారిని ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఏర్పాటుచేశారు?
(1) 346 (2) 350 (బి) (3) 351 (4) 350(1x)

58. కాగ్ సర్వీస్ నిబంధనలను జీతభత్యాలను పార్లమెంట్ ఓ చట్టం ద్వారా నిర్ణయిస్తుందని ఏ ప్రకరణ తెలియజేస్తుంది? అదేమిటి?
(1) 14 8(1)ప్రకరణ (2) 148(3) ప్రకరణ
(3) 148 (2)ప్రకరణ (4)148(4) ప్రకరణ

59. దేశంలో అత్యున్నతమైన న్యాయాధికారి ఎవరు?
(1) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (2) అడ్వకేట్ జనరల్
(3) అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా
(4) సొలిటిజర్ జనరల్ ఆఫ్ ఇండియా

60. వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్‌కు ఏ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ హోదా కల్పించారు?
(1)101 వ రాజ్యాంగ సవరణ (2) 102 వ రాజ్యాంగ సవరణ
(3) 103వ రాజ్యాంగ సవరణ (4) 104 వ రాజ్యాంగ సవరణ

61. ఏ సంవత్సరం షెడ్యూల్ కులాల కోసం విడిగా 'షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్'ను ఏర్పాటు చేశారు?
(1) 2001 (2) 2002 (3) 2003 (4) 2004

62. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్; సభ్యులు తమ రాజీనామా పత్రం ఎవరికి సమర్పిస్తారు?
(1) రాష్ట్రపతి (2) రాష్ట్ర గవర్నర్
(3) రాష్ట్ర అసెంబ్లీ (4) పార్లమెంట్

63. యుపిఎస్‌సి చైర్మన్, సభ్యులను తొలగింపు విధానం గురించి భారత రాజ్యాంగంలో ఏ ప్రకరణ వివరిస్తుంది?
(1) 316(1) ప్రకరణ (2) 317(1) ప్రకరణ
(3) 320 ప్రకరణ (4) 321 ప్రకరణ

64. పార్లమెంటు లేదా రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన ఒక శాసనం షెడ్యూల్ ప్రాంతానికి వర్తించకుండా చేసే అధికారం ఈ కింది వారిలో ఎవరికి ఉంది?
(1) రాష్ట్రపతి (2) రాష్ట్ర గవర్నర్
(3) కేంద్ర మంత్రిమండలి (4) స్పీకర్

65. జాతీయ ఓటరు దినోత్సవం ఎప్పుడు?
(1) జనవరి 21 (2) జనవరి 23
(3) జనవరి 24 (4) జనవరి 25

66. 74వ రాజ్యాంగ సవరణ ఏ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది?
(1)1993 జూన్ ఒకటో తేదీ
(2) 19న 93 జూన్ రెండో తేదీ
(3)1993 ఆగస్టు ఒకటో తేదీ
(41993 సెప్టెంబర్ ఒకటో తేదీ

జవాబులు :

(1) 1 (2) 4 (3) 3 (4) 3 (5) 3 (6) 1 (7) 1 (8) 3 (9) 4 (10) 2 (11) 2 (12) 3 (13) 2 (14) 3 (15) 1 (16) 4 (17) 2 (18) 3 (19)4 (20) 2 (21) 2 (22) 2 (23) 2 (24) 1 (25) 2 (26) 1 (27) 3 (28) 1 (29) 1 (30) 2 (31) 3 (32) 1 (33) 2 (34) 2 (35) 4 (36) 2 (37) 2 (38) 1 (39) 1 (40) 1 (41) 3 (42) 2 (43) 1 (44) 3 (45) 1 (46) 2 (47) 2 (48) 3 (49) 2 (50) 3 (51) 3 (52) 3 (53)2 (54) 4 (55) 3 (56) 1 (57) 2 (58)2 (59) 3(60) 2 (61) 4 (62) 2 (63) 2 (64) 2 (65) 4 (66) 1



పెద్దపులి సంచారంతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)

పెద్దపులి సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామానికి సమీపంలో గండి చెరువు ఉంది. అక్కడ నుంచి నల్లమల అటవీ ప్రాంతం మొదలవుతుంది. అక్కడ వరకు బొమ్మలాపురం గ్రామస్తులు పొలాలు చేసుకుని పంటలు వేసుకుంటున్నారు. ఆదివారం ఉదయం ట్రాక్టర్‌పై కొంతమంది రైతులు కూలీలను తీసుకొని వెళ్తుండగా గండి చెరువుపైన దేవులూటిగూడెం పరిసర ప్రాంతాల్లో పెద్దపులి నడుచుకుంటూ వెళ్తూ వీరికి కనిపించింది. దీంతో, ట్రాక్టర్‌పై వెళ్తున్న రైతులు పులిని సెల్‌ఫోన్ ద్వారా వీడియోలు తీశారు. అనంతరం భయపడి ముందుకు వెళ్లలేక తిరిగి గ్రామానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఫారెస్ట్ రేంజర్ హరి మాట్లాడుతూ పెద్దపులి ఆ ప్రాంతంలో సహజ సిద్ధంగా సంచరిస్తోందని, రైతులు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, దాని దగ్గరికి ఎవరు వెళ్లొద్దని సూచించారు. గతంలో కూడా ట్రాప్‌లో పరిశీలించినట్లు తెలిపారు. రైతులకు అవగాహన కల్పించి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దళితులను ఆలయంలోకి రానివ్వని పూజారిపై చర్యలు

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితులను ఆలయంలోకి రానివ్వకుండా తాళాలు వేసిన పూజారిపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. తిరుపతి జిల్లా, దొరవారి సత్రం మండలం, పాలెంపాడు శ్రీ కోరిందమ్మ పరమేశ్వరి ఆలయంలోకి వస్తున్న ఎస్‌సిలను పూజారి అడ్డుకుని తాళాలు వేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు ఎస్‌సిలు ఆదివారం పూజల కోసం వెళ్లగా, ఆలయానికి పూజారి తాళాలు వేయడం దుర్మార్గమన్నారు. ఆలయం బయటే నైవేద్యం పెట్టుకోవాలని పూజారి చెప్పినట్లు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి పూజారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం బాధ్యత తీసుకుని ఆలయంలో పూజలు చేస్తామని వచ్చిన వారందరికీ ప్రవేశం కల్పించాలని, వారికి రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం రాజ్యాంగం ప్రకారం ఎస్‌సిల హక్కులను అమలు చేయాలని కోరారు.

జూబ్లిహిల్స్ అభ్యర్థిపై కసరత్తు పూర్తి

- నలుగురితో జాబితా ఖరారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపికపై కసరత్తు పూర్తి చేసింది. అభ్యర్థుల సామాజిక సమీకరణాలు, ఆర్థిక స్థితిగతులు, పనితీరు, కుటుంబ నేపథ్యం తదితర అంశాలను బేరీజువేసిన టిపిసిసి నలుగురి పేర్లతో జాబితాను ఖరారు చేసింది. నవీన్‌యాదవ్, సిఎన్ రెడ్డి, బొంతు రామ్మోహన్, అంజన్ కుమార్ యాదవ్ పేర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. ఈ నలుగురి అభ్యర్థుల బయోడేటాతో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. జాబితా పరిశీలించి అన్నివిధాలా బలమైన అభ్యర్థిని ఏఐసిసి ప్రకటించనుంది. కాగా, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో కేసు దృష్ట్యా కాంగ్రెస్ నేతల ఢిల్లీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఢిల్లీలోని సీనియర్ న్యాయవాదులను కలిసి.. బలమైన వాదనలు వినిపించేలా వారితో చర్చించనున్నారు.

మత విద్వేషాన్ని చిమ్ముతున్న మీడియా

- జీ న్యూస్, టైమ్స్ నౌ నవభారత్‌పై ఎన్‌బిడిఎస్‌ఎ చర్యలు

న్యూఢిల్లీ : మత విద్వేషాన్ని చిమ్ముతున్న మీడియా సంస్థలు జీ న్యూస్, టైమ్స్ నౌ నవభారత్‌పై న్యూస్ బ్రాడ్‌కాస్టింగ్ అండ్ డిజిటల్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎన్‌బిడిఎస్‌ఎ) చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఒక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంస్థలు ప్రసారం చేసిన కథనాలను స్పష్టమైన ఇస్లామోఫోబిక్‌గా విమర్శించింది. ఈ సంస్థలు బ్రాడ్‌కాస్టింగ్ నియమావళిని స్పష్టంగా ఉల్లంఘించాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. విద్వేష కథనాలను తొలగించాలని ఆదేశించింది. దేశంలోని ముస్లిం సమాజంపై ఈ సంస్థలు మత విద్వేషాలను వ్యాప్తి చేస్తున్నాయని పరిశోధకులు, జర్నలిస్టు ఇంద్రజీత్ ఘోర్పడే గత ఏడాదిలో చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఉత్తర్వులు జారీ చేసింది. జీ న్యూస్ వరస ప్రసారం చేసిన 'మెహందీ జీహాద్ ఫర్ దే దానా-దాన్', 'లాఠీ సే లైస్ రహెంగే, జిహాదీయోం కో రోకెంగే', టైమ్స్ నౌ నవభారత్ ప్రసారం చేసిన 'లవ్ జిహాద్' వంటి కథనాలపై ఆయన ఫిర్యాదు చేశారు.

15 తర్వాత నిరవధిక సమ్మె

- సమస్యలు పరిష్కరించాలి
- విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్


రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 15 నుంచి సమ్మె తప్పదని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యాన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం.. రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ నెల 14న వర్క్ టు రూల్ పాటిస్తామని, 15 తర్వాత నిరవధిక సమ్మెకు వెళ్తామని ప్రకటించింది. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో స్ట్రగుల్ కమిటీ ఛైర్మన్ పి సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సమావేశం తీర్మానించింది. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డిఎలను విడుదల చేయాలని, 1999 తర్వాత నియామకమైన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు నగదు రహిత మెడికల్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేసింది. జెఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు ఎపిఎస్‌సిబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని తీర్మానించింది. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, యుఇసిడబ్ల్యుయు-హెచ్-176 ఆర్గనైజింగ్ కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ.. విద్యుత్ రంగంలో కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే ఉద్యమాలే శరణ్యమని చెప్పారు. రాష్ట్రంలోని విద్యుత్ రంగంలోకి అదాని, అంబాని అడుగు పెట్టారని తెలిపారు. త్వరలో విద్యుత్ రంగం ప్రైవేటుపరం కాబోతోందని, దీనికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ కార్మికుల పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని సంపూర్ణ మద్దతు తెలిపారు. స్ట్రగుల్ కమిటీ ఛైర్మన్ సుదర్శన్ రెడ్డి, సెక్రటరీ జనరల్ వి సుబ్బిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గంగయ్య, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి సూరిబాబు మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో సుమారు 27 వేలమంది కాంట్రాక్టు కార్మికులు తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని తెలిపారు. వీరిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయాల్లో హామీలిస్తున్న ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక కార్మికులను విస్మరించడం పరిపాటిగా మారిందని విమర్శించారు. తెలంగాణలో 16 వేలమంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేశారని, రాష్ట్రంలోని కార్మికుల జీవితాలు మాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు మోహన్‌రావు, నాయబ్, ప్రసాద్, హజరత్ అయ్యా, శివశంకర్, లక్ష్మణరావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

అంతుచిక్కని వ్యాధితో తురకపాలెంలో మరో మహిళ మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



అంతుచిక్కని వ్యాధితో మరణాలు సంభవిస్తున్న గుంటూరు జిల్లా తురకపాలెంలో ఆదివారం మరొక మహిళ మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... స్థానిక బిసి కాలనీకి చెందిన చల్లా కృష్ణవేణి (24) గత పది రోజుగా జ్వరంతో బాధపడుతూ గుంటూరు, మంగళగిరి, విజయవాడలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రెండ్రోజుల క్రితం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో చేరారు. ఆదివారం మధ్యాహ్నం పరిస్థితి విషమించి ఆమె మృతి చెందారు. జ్వరంతో పాటు వంటిపై గడ్డలు ఏర్పడ్డాయని, చికిత్స కోసం ప్రైవేట్ హాస్పిటల్స్ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు షుగర్ వ్యాధి ఉందని ఆస్పత్రి వైద్యులు కె షీట్‌లో నమోదు చేశారు. మెలోడిసిస్ వ్యాధి కారణంగానే మృతి చెంది ఉండవచ్చని తొలుత భావించినా, షుగర్ వ్యాధి వల్ల ఆమె మృతి చెందినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి తెలిపారు. 24 ఏళ్లకే షుగర్ వ్యాధితో మృతి చెందడం సంచలనంగా మారింది. మరోవైపు తురకపాలెంలో జులై 1 నుంచి ఇప్పటి వరకూ దాదాపు 22 మంది మృతి చెందినట్టు ప్రభుత్వం గుర్తించింది. కానీ, వారి మృతికి ఇంత వరకు స్పష్టమైన కారణాలను అధికారులు వెల్లడించలేకపోయారు. యురేనియం నిక్షేపాలు ఉండటంవల్ల తాగు నీరు కలుషితమౌతోందని వార్తలు వస్తున్నాయి.

బల్క్ డ్రగ్ వ్యతిరేక ఉద్యమంపై నిర్బంధం

- రాజమండ్రిలో బిసివై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ అడ్డగింత
- ఎస్.రాయవరంలో సిపిఎం నేత అప్పలరాజు హౌస్ అరెస్టు


అప్పలరాజును హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

నక్కపల్లి మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన ఆందోళనపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. పోరాటానికి అండగా నిలుస్తున్న నాయకులపై తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తు న్నారు. మత్స్యకారుల ఉద్యమానికి మద్దతు తెలిపేందుకు వస్తున్న భారత చైతన్య యువజన పార్టీ అధినేత బి.రామచంద్ర యాదవ్‌ను ఈ క్రమంలోనే రాజమండ్రిలోని ఓ హోటల్‌లో పోలీసులు ఆదివారం అడ్డగించారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం ధర్మవరంలో గృహ నిర్బంధం చేశారు. నక్కపల్లి అడ్డురోడ్డులో దాట్ల ఉమాదేవిని అడ్డుకు న్నారు. పోలీసుల ఆంక్షలు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, బల్క్‌డ్రగ్ పార్కు నిలుపుదల చేయకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని మత్స్యకారులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. వారు రాజయ్యపేటలో చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారానికి 22వ రోజుకు చేరాయి. సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు బొంది బాబ్జి, పలువురు మత్స్యకార నాయకులు మాట్లాడుతూ పోలీసుల, ప్రభుత్వ తీరును ఖండించారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తే మత్స్యకారుల జీవన విధానానికి, ఉపాధికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. ఆందోళన శిబిరం వద్దకు ఇతర వ్యక్తులను రానివ్వకుండా పోలీసులు ఎక్కడికక్కడ మోహరించారు. నక్కపల్లి, బోయపాడు, బుచ్చిరాజుపేట, టోల్‌గేట్, వేంపాడు జంక్షన్‌ల వద్ద పోలీసు వలయాలు కనిపించాయి. పోలీసు నిర్బంధాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో ఖండించారు.

టమోటా ధర పతనం

- పత్తికొండ మార్కెట్ యార్డులో కిలో రూపాయి
- పంటను పారబోసి రైతులు నిరసన


పత్తికొండ మార్కెట్‌కు భారీగా వచ్చిన టమోటా

ప్రజాశక్తి- పత్తికొండ (కర్నూలు జిల్లా)

కర్నూలు జిల్లా పత్తికొండ వ్యవసాయ మార్కెట్లో టమోటా ధర ఆదివారం భారీగా పతనమైంది. కిలో టమోటాను రూపాయి చొప్పున మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేయడంతో రైతులు ఆగ్రహానికి లోనయ్యారు. రోడ్డుపై టమోటాను పారవేసి నిరసన తెలిపారు. ఈ మార్కెట్ యార్డుకు 510 క్వింటాళ్ల టమోటా వచ్చింది. నాణ్యత లేదనే పేరుతో 30 కిలోల బాక్సును రూ.30, రూ.40, రూ.50కు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారు. దీంతో, వారిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగళూరు-మంత్రాలయం ప్రధాన రహదారిపై టమోటాలను పారబోసి నిరసన తెలిపారు. దీంతో, ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. వ్యాపారస్తులు, కొందరు రాజకీయ పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై తమను మోసగిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కిలో టమోటాలను రూపాయికి కొనుగోలు చేస్తే ఎలా వ్యవసాయం చేయాలని వాపోయారు. కనీసం రవాణా ఖర్చులకు కూడా సరిపోవడం లేదన్నారు. ఇంత ఎక్కువగా టమోటాను మార్కెట్‌కు ఎందుకు తెస్తున్నారంటూ వ్యాపారులు తమ పట్ల అసభ్యకరంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర కల్పించాలని, టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బహిరంగ మార్కెట్లో కిలో టమోటాను వ్యాపారులు రూ.30కు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.

రైతులను మోసగిస్తే సహించం : మార్కెట్ సెక్రెటరీ కార్న్ లీస్

టమోటా నాణ్యత లేదనే పేరుతో వ్యాపారులు మోసగిస్తే సహించం. రైతులకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకుంటాం. రైతులు మార్కెట్లో ఎదుర్కొంటున్న సమస్యలను మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తున్నాం.



నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డ్యామ్‌లో ఆదివారం జరిగిన భారీ ర్యాలీ

గాజాపై దాడులకు వ్యతిరేకంగా నెదర్లాండ్స్‌లో నిరసనలు

ఆమ్‌స్టర్‌డ్యామ్ : గాజాపై ఇజ్రాయిల్ నిరంకుశ దాడులకు వ్యతిరేకంగా నెదర్లాండ్స్‌లో నిరసనలు వెల్లు వెత్తాయి. ముఖ్యంగా రాజధాని ఆమ్‌స్టర్‌డ్యామ్‌లో ఆదివారం జరిగిన భారీ నిరసన మార్చ్‌లో 25 వేలకు పైగా ప్రజలు పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆమ్‌స్టర్‌డ్యామ్ ప్రధాన రహదారిపై దాదాపు 6 కిలోమీటర్ల మేర ఈ మార్చ్ జరగడం విశేషం. అలాగే, ఈ నెల 29న నెదర్లాండ్స్ సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు కేవలం మూడు వారాల ముందు ఈ భారీ మార్చ్ జరగడం గమనార్హం. ఈ మార్చ్‌లో పాలస్తీనా జెండాలను ప్రదర్శిస్తూ 'స్వతంత్ర పాలస్తీనా' అనే నినాదాలు చేశారు. అలాగే, 'ఇజ్రాయిల్‌కు సిగ్గుచేటు', 'గాజాకు స్వేచ్ఛ స్వాతంత్ర్యం వచ్చేవరకూ మాకు స్వాతంత్ర్యం లేదు' అని రాసి ఉన్న ప్లకార్డులు పట్టుకున్నారు. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే గాజాపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ డచ్ ప్రభుత్వం కఠినమైన వైఖరి తీసుకోవాలని విజప్తి చేశారు.

గాజాలో జరుగుతున్న ప్రతీదాన్ని ఖండించడానికి తాము ఇక్కడ ఉన్నామని నిరసనలో పాల్గొన్న 27 ఏళ్ల ఎమిలియో రివెరో తెలిపారు. ఇజ్రాయిల్ యుద్ధ నేరాలకు పాల్పడకుండా నిరోధించడానికి డచ్ ప్రభుత్వం తగినంతగా చేయడం లేదని నిరసనకారులు విమర్శించారు. డచ్ ప్రభుత్వం ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాలని, కాల్పుల విరమణ జరిగేలా చూడాలని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణకు గుర్తయిన 'రెడ్‌లైన్'కు మద్దతుగా ఎక్కువ మంది ఎరుపు దుస్తులు ధరించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

నకిలీ మద్యం తయారీ కేసులో మరో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి- ములకలచెరువు (అన్నమయ్య జిల్లా)

నకిలీ మద్యం తయారీ కేసులో మరో ముగ్గురు బెల్ట్ షాపుల నిర్వాహకులను వేర్వేరుగా ఎక్సైజ్ పోలీసులు, ములకలచెరువు ఎస్ఐ నరసింహుడు అరెస్టు చేశారు. దీంతో, అరెస్టయిన వారి సంఖ్య 13కు చేరుకుంది. ఆదినారాయణ, వెంకటరమణ, పాల రాములను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ములకలచెరువులో నకిలీ మద్యం గుట్టురట్టు కావడంతో బెల్ట్ షాపులు నిర్వాహకులపై ఎక్సైజ్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. శనివారం పదిమందిని అరెస్టు చేశారు. ఈ కేసులో తంబళ్లపల్లి టిడిపి ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డికి సన్నిహితుడైన జనార్ధన్‌రావును ఎ-1గా, జయచంద్రారెడ్డి పిఎ రాజేష్‌ను ఎ-5గా చేర్చారు. రెండో రోజూ ఎక్సైజ్ పోలీసులు, ఎస్ఐ ముమ్మరంగా మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పిటిఎం మండలం మల్లెలకు చెందిన ఆదినారాయణను అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పులికల్లు సమీపంలోని కమ్మవారిపల్లె వద్ద దానిమ్మతోటలో వెంకటరమణను అరెస్టు చేశారు. ఆయన నుంచి మూడు బాక్సుల బీరు బాటిళ్లు, 27 నకిలీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పాతకోటలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పాలు రామును ములకలచెరువు ఎస్ఐ అరెస్టు చేశారు. ఆయన వద్ద 76 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 103 మద్యం బాటిళ్లు, మూడు బాక్సుల బీరు బాటిళ్లను స్వాధీనం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నియోజకవర్గంలోని మద్యం దుకాణాలతోపాటు బెల్ట్ షాపుల్లో కూడా నకిలీ మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ పోలీసులు బృందాలుగా ఏర్పడి నియోజకవర్గ వ్యాప్తంగా బెల్టు షాపులపై దాడులు నిర్వహిస్తున్నారు.

నిందితులపై కఠిన చర్యలు

- నకిలీ మద్యం కేసుపై సిఎం చంద్రబాబు సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. నకిలీ మద్యం వ్యవహారంపై ఉండవల్లిలోని తన నివాసంలో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సంఘటనపై అన్ని కోణాల్లో విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ వ్యవహారంలో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని చెప్పారు.నిందితులు ఎంతటివారైనా వదలొద్దన్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ప్రజల ప్రాణాలకు చేటు చేసే నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. నకిలీ మద్యం వ్యవహారంపై అధికారులు సిఎంకు వివరాలు తెలిపారు. ములకల చెరువు సమీపంలోని కదిరినత్తునికోటలో తనిఖీల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రం బయటపడిందని తెలిపారు. తయారుచేస్తున్న 14 మందిని గుర్తించి 10 మందిని అరెస్టు చేశామని తెలిపారు. ఎ1గా అద్దేపల్లి జనార్ధన్ రావు అనే వ్యక్తిని గుర్తించామని, అతనికి విజయవాడలో ఒక బార్ లైసెన్సు ఉందని తెలిపారు.నకిలీ మద్యం దందాకు ములకలచెరువుకు వచ్చారని పేర్కొన్నారు. జనార్ధన్‌రావుతో పాటు ఏ2కొట్టూరాజు, ఏ5 పి రాజేష్, ఏ12 కె శ్రీనివాసరావులను అరెస్టు చేయాల్సి ఉందని వివరించారు. ఆర్థిక లావాదేవీలతో పాటు నకిలీ మద్యాన్ని ఎక్కడెక్కడకు సరఫరా చేశారన్న అంశాన్ని లోతుగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆ శాఖమంత్రి కొల్లు రవీంద్ర, ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఇద్దరు టిడిపి నేతలు సస్పెన్షన్ : పల్లా శ్రీనివాసరావు

కల్తీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టిడిపి నేతలు దాసరిపల్లి జయచంద్రారెడ్డి, కట్టా సురేంద్ర నాయుడును పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీరిద్దరిపై పార్టీ పరంగా విచారణ చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

పౌరుల హత్యపై స్వతంత్ర దర్యాప్తు

- జైలు నుంచి సోనమ్ డిమాండ్

న్యూఢిల్లీ : లెహ్‌లో సెప్టెంబర్ 24న జరిగిన నిరసనలో మరణించిన నలుగురు పౌరుల మృతిపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేశారు. లెహ్ అపెక్స్ బాడీ (ఎల్‌ఎబి) న్యాయసలహాదారు ముస్తఫా హాజీ ఆదివారం లేఖలోని వివరాలను మీడియాకు తెలిపారు. న్యాయవాది ముస్తఫా శనివారం జైలులో వాంగ్‌చుక్‌తో సమావేశమయ్యారు. ముస్తఫాతో పాటు వాంగ్‌చుక్ సోదరుడు త్సెటాన్ డోర్జే కూడా ఉన్నారు. మృతుల కుటుంబసభ్యులకు హృదయపూర్వకంగా సానుభూతి తెలుపుతున్నానని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, అరెస్టయిన వారు విడుదలవ్వాలని కోరుకుంటున్నాను. నలుగురు పౌరుల హత్యపై స్వతంత్ర న్యాయవిచారణ జరిపించాలని, లేకుంటే జైలులోనేఉండేందుకు సిద్ధమని లేఖలో పేర్కొన్నారు. ఎల్‌ఎబి ఏ చర్యలు తీసుకున్నా వారికి తన మద్దతు ఉంటుందని అన్నారు. శాంతి మరియు ఐక్యతను కాపాడుకోవాలని, గాంధీ చూపిన నిజమైన అహింస మార్గంలో పోరాటాన్ని శాంతియుతంగా కొనసాగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాను జైలులో శారీరకంగా, మానసికంగా ధృడంగానే ఉన్నానని, ఆందోళన చెందవద్దని లేఖలో పేర్కొన్నారు. లడఖ్‌కి రాష్ట్రహోదా కల్పించాలని, ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలన్న డిమాండ్లపై ఎల్‌ఎబి నేతృత్వంలో ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. నిరసనకారులపై పోలీసులు జరిపిన కాల్పుల్లో నలుగురు మరణించగా, సుమారు 90మంది గాయపడ్డారు. నిరాహార దీక్ష చేపట్టిన వాంగ్‌చుక్‌ను సెప్టెంబర్ 26న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

జెన్ జడ్ నిరసనలతో హోరెత్తిన మొరాకో

- అవినీతి, నిరుద్యోగంపై గళమెత్తిన యువత
- ప్రజారోగ్యం పట్టదా అని నిలదీత


మొరాకోలో భారీ నిరసన

రబాత్ : ఉత్తర ఆఫ్రికా దేశమైన మొరాకోలోని పలు నగరాలు జెన్ జడ్ నిరసనలతో హోరెత్తాయి. డిజిటల్ అసంతృప్తిని వాస్తవ ప్రపంచ ఉద్యమంగా మార్చే సామర్థ్యం తమకు ఉన్నదని ఆందోళనకారులు, యువత హెచ్చరించారు. ఆ మహోద్యమాన్ని అధికారులు విస్మరించలేరని తెలిపారు. అవినీతిని, ఉపాధి అవకాశాలు లేకపోవడాన్ని నిరసిస్తూ మడగాస్కర్, కెన్యా, పెరూ, నేపాల్‌లో ఇలాంటి ఉద్యమాలే జరుగుతున్నాయి. ఇప్పుడు వాటి సరసన మొరాకో కూడా చేరింది. 2030లో జరిగే ఫీఫా ప్రపంచ కప్ కోసం స్టేడియంల నిర్మాణం నిమిత్తం భారీగా నిధులు వెచ్చించాలన్న ప్రభుత్వ యోచనపై ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ప్రజల ఆరోగ్యంపై ఏ మాత్రం శ్రద్ధ చూపని ప్రభుత్వం ఫీఫా కప్ కోసం పెద్ద మొత్తంలో ఎందుకు డబ్బు ఖర్చు చేస్తోందని వారు మండిపడ్డారు.

వలస బాటలో యువత

మొరాకో జనాభాలో సగానికి పైగా 35 సంవత్సరాల లోపు వారే. మౌలిక సదుపాయాలు, పర్యాటకంపై ప్రభుత్వం భారీగా డబ్బు వెచ్చిస్తున్నప్పటికీ 15-24 ఏళ్ల మధ్య వయస్కుల్లో నిరుద్యోగం 36 శాతానికి పెరిగింది. ఉద్యోగావకాశాలు లేకపోవడంతో యాభై శాతానికి పైగా యువత వలసలకు సిద్ధమవుతున్నారు. నిరసన ప్రదర్శనల్లో పాల్గొంటున్న వారిలో ఎక్కువ మంది మైనర్లేనని అధికారులు చెబుతున్నారు. 18 సంవత్సరాలు కూడా నిండని వారిని పోలీసులు నిర్బంధించారని హక్కుల గ్రూపులు ఆరోపించాయి.

సమస్యలతో కుంగిపోతున్న ప్రజానీకం

మొరాకో నగరం ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. పెరుగుతున్న జీవన వ్యయం, చాలీచాలని జీతాలు ప్రజలను కుంగదీస్తున్నాయి. మొరాకో జనాభా 3.7 కోట్లు కాగా వారిలో చాలా మందిది ఇదే పరిస్థితి. ప్రాంతీయ అసమానతలు పెరిగిపోతున్నాయి. ఆఫ్రికాలో హై స్పీడ్ రైల్వే లైన్ ఉన్న ఏకైక దేశం మొరాకో. ఫిఫా ప్రపంచ కప్ కోసం ఏడు కొత్త స్టేడియంలను నిర్మిస్తున్నారు. మరో ఏడింటిని ఆధునీకరిస్తున్నారు. ప్రపంచ కప్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ఐదు బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేయాలని మొరాకో యోచిస్తోంది. దేశంలో ఉద్యోగుల సగటు నెలసరి జీతం 300 డాలర్లు మాత్రమే. రహదారుల పరిస్థితి ఘోరంగా ఉంది. ఆస్పత్రుల్లో వైద్యులు ఉండరు. విద్యా వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉంది. ప్రాంతీయ అసమానతలు, అర్థం పర్థం లేని ప్రభుత్వ ప్రాధాన్యతలు మొరాకో ప్రజల్లో అసంతృప్తికి, అసహనానికి కారణమవుతున్నాయి. అల్ హౌజ్ ప్రాంతంలో 2023లో భారీ భూకంపం ధాటికి నిరాశ్రయులైన ప్రజల్లో చాలా మంది సహాయ శిబిరాల్లోనే తలదాచుకుంటున్నారు. అగాదిర్ నగరంలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో బిడ్డలకు జన్మనిచ్చిన అనంతరం ఎనిమిదిమంది మహిళలు ప్రాణాలు కోల్పోయిన తర్వాత గత నెలలో ప్రజల్లో ఆగ్రహజ్వాలలు మిన్నంటాయి. ప్రభుత్వానికి మాఫియాతో సంబంధం ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని, ఆరోగ్య మంత్రి, ఆయన వ్యాపార భాగస్వామి లక్ష్యంగా నిరసనకారులు విమర్శలు సంధిస్తున్నారు.

నేపాల్‌ను ముంచెత్తిన వరదలు

- 47 మంది మృతి

ఖాట్మాండు : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నేపాల్‌లోని పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. నదులన్నీ ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, రహదారులు బ్లాక్ కావడంతో పాటు వంతెనలు కొట్టుకు పోయాయని, ఈ ఘటనల్లో 47 మంది చనిపోయారని, అనేక మంది గాయపడ్డారని సంబంధిత అధికారులు ఆదివారం తెలిపారు. భారత్‌కు తూర్పు సరిహద్దుగా ఉన్న ఇలాం జిల్లాలో వేర్వేరు కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 35 మరణించినట్లు సాయుధ పోలీసు బలగాల ప్రతినిధి కాలిదాస్ ధౌబోజీ తెలిపారు. శుక్రవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పోటెత్తిన వరద నీటిలో 9 మంది గల్లంతయ్యారని, అలాగే దక్షిణ నేపాల్‌లో పిడుగుపాటు కారణంగా ముగ్గురు చనిపోయారని పేర్కొన్నారు. ఆగ్నేయ నేపాల్‌లోని కోషి నది సహా నదులన్నీ ప్రమాదకరస్థాయిని మించి ప్రవహిస్తున్నట్లు తెలిపారు. కోషి నదిలో నీటి ప్రవాహం సాధారణం కన్నా రెండింతలు ఉన్నట్లు తెలిపారు. 56 సూయిజ్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా సోమ, మంగళవారాలను ప్రభుత్వ సెలవు దినాలుగా ప్రకటించారు. వరదల్లో శనివారం 11 మంది కొట్టుకుపోయారని, వారి కోసం గాలిస్తున్నామని అన్నారు.

గ్రేటా థన్‌బర్గ్‌ను వేధించిన ఇజ్రాయిల్ దళాలు...

ఇస్తాంబుల్ : పర్యావరణ ఉద్యమకారిని 22 ఏళ్ల గ్రేటాథన్‌బర్గ్‌ను ఇజ్రాయిల్ దళాలు వేధించాయి...గాజాకు మానవతాసాయం అందించడానికి, చిన్న పిల్లలకు ఆహారం, వారికి సహాయ సామాగ్రిని అందించేందుకు సెప్టెంబర్ 1వ తేదీన బార్సిలోనా నుండి దాదాపు 42 దేశాల నుండి 70 పైగా బోట్లతో గ్రేటా థన్‌బర్గ్‌తో పాటు వందలాది మంది కార్యకర్తలు గాజాకు వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే దీన్ని సహించని నెతన్యాహు ప్రభుత్వం వారిని అడ్డుకుని 450 మందిని అదుపులోకి తీసుకుంది. ఇజ్రాయిల్ దళాలు గ్రేటా జుట్టు పట్టుకుని బలవంతంగా గుంజాయని, ఆ దేశ జెండాను ముద్దుపెట్టుకోవాలని గద్దించారని, చాలా అవమానకర రీతిలో వారు వ్యవహరించారని విడుదలై ఇస్తాంబుల్ చేరుకున్న ఫ్లోటిల్లా కార్యకర్తలు వెల్లడించారు. మమ్మల్ని జంతువులకన్నా హీనంగా చూసారని, కనీసం మంచినీరు, సరైన ఆహారం ఇవ్వలేదని మీడియాకు వెల్లడించారు. అయితే ఫ్లోటిల్లా సహాయం పబ్లిసిటీ స్టంట్ అని, వారు చెప్పినవి అవాస్తవాలని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

చికాగోకు జాతీయ గార్డ్ దళాలు

వాషింగ్టన్ : చికాగోలో నేరాలు అదుపు తప్పుతున్నాయని భావిస్తున్న అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ అక్కడ 300 జాతీయ గార్డ్ దళాలను మోహరించేందుకు అనుమతించారు. డెమొక్రాట్ల పాలనలో ఉన్న చికాగో నగరంలో తాము నిరసనలను ఎదుర్కొంటున్నామని, తమ వాహనాల పైకి ఓ సాయుధ మహిళ సహా పలువురి కార్లు దూసుకొచ్చాయని ఇమ్మిగ్రేషన్ అధికారులు తెలిపిన కొద్ది గంటల వ్యవధిలోనే ట్రంప్ ఈ చర్య తీసుకున్నారు. తన కారుతో ఇమ్మిగ్రేషన్ అధికారుల వాహనం పైకి దూసుకొచ్చిన మహిళను సరిహద్దు గస్తీ సిబ్బంది కాల్చి చంపారు. ఆ మహిళ ఎవరైనదీ తెలియరాలేదు. కాగా దళాలను మోహరించాలన్న ట్రంప్ ఆలోచనను రాష్ట్ర, స్థానిక అధికారులు అనేక వారాలుగా వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఇది అధికార దుర్వినియోగమేనని వారు ఆరోపించారు. సంక్షోభాన్ని సృష్టించడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారని ఇల్లినాయిస్ గవర్నర్ జెబి ప్రిజ్‌కర్ విమర్శించారు. అమెరికాలోని ఒరెగాన్ నగరంలో కూడా 200 దళాలను మోహరించాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే పోర్ట్‌ల్యాండ్‌లోని ఫెడరల్ జడ్జి ఒకరు దీనికి తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. ప్రభుత్వ చర్య రాజ్యాంగ ఉల్లంఘనేనని న్యాయమూర్తి కరిన్ ఇమ్మర్‌గట్ తెలిపారు.

నవంబర్ 22లోగా బీహార్ ఎన్నికలు

- బ్యాలెట్‌లో అభ్యర్థుల కలర్ ఫొటోలు
- సిఇసి జ్ఞానేశ్ కుమార్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నవంబర్ 22 లోగా బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఇసిఐ పూర్తి సన్నద్ధంగా ఉందని చెప్పారు. ఇవిఎంల్లో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను పెట్టనున్నామని, కలర్ ఫొటోలు పెట్టడం ఇదే తొలిసారి అని చెప్పారు. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించగా.. ఆదివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో ఎన్నికల కమిషన్ సమావేశమైంది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోకమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సింధు, వివేక్ జోషిలతో కలిసి జ్ఞానేష్ కుమార్ మాట్లాడారు. పుట్టిన తేదీ, పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ కాదని మరోసారి స్పష్టం చేశారు. చట్టానికి లోబడే ఆధార్‌ను ఉపయోగిస్తున్నామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని, గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉంటుందని చెప్పారు. ఇప్పటికే బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పూర్తి చేశామని, ఎన్ని దశల్లో పోలింగ్ నిర్వహించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫోటోలను ఉంచడం తద్వారా అభ్యర్థులను ఓటర్లు తేలికగా గుర్తుపట్టేందుకు వీలుంటుందని తెలిపారు. సీరియల్ నంబర్ కూడా పెద్దగా కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. తదుపరి ఎన్నికల నుంచి దేశవ్యాప్తంగా సీరియల్ నంబర్ ఫాంట్లు పెద్దవిగా ఉండేలా, అభ్యర్థుల ఫోటోలు కలర్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.


ఇవిఎం లను సరిచూసుకుంటున్న అధికారులు (ఫైల్)

బీహార్‌లో 22 ఏళ్ల తరువాత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేపట్టామని చెప్పారు. 243 నియోజకవర్గాల్లో ఒక్కొదానికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) ఉన్నారని, ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి వారికి 90,207 మంది బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓ) సహాయం చేశారని తెలిపారు. ఎస్ఐఆర్‌లో అనర్హులను జాబితా నుంచి తొలగించామని, దీన్ని బీహార్ ఓటర్లు కూడా స్వాగతించారని పేర్కొన్నారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలిపేందుకు రాజకీయ పార్టీలకు ఇంకా అవకాశం ఉందన్నారు. ఛాత్ పండుగను ఎంత ఉత్సాహంగా జరుపుకుంటామో అంతే ఉత్సాహంతో బీహార్ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

వరుస సమావేశాలు

ఆదాయం పన్ను శాఖ, పోలీసు శాఖ, ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో ఎన్నికల కమిషన్ ఆదివారం వరుస సమావేశాలు జరిపింది. స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికల నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ పథకంపై సమీక్ష జరిపింది. అనంతరం చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి, సెంట్రల్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రతినిధులతో సమావేశమైంది. ఆ వెంటనే చీఫ్ సెక్రటరీ, డెరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఇతర బ్యూరోక్రాట్లతో రాష్ట్రస్థాయిలో సమన్వయంపై సమీక్ష జరిపింది.

కటక్‌లో మత ఉద్రిక్తతలు

- ఇంటర్నెట్‌పై ఆంక్షలు

భువనేశ్వర్ : ఒడిశాలోని కటక్ నగరంలో దుర్గా పూజ ప్రతిమ నిమజ్జనం సందర్భంగా మత ఉద్రిక్తతలు చెలరేగాయి. దీంతో 24 గంటల పాటు ఇంటర్నెట్ సేవలన్నిటినీ నిలిపివేస్తున్నట్లు ఒడిశా ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. కటక్‌లో కథాజోడి నదిలో నిమజ్జనం చేసేందుకు ప్రతిమను తీసుకెళుతుండగా..మార్గమధ్యలో దర్గాబజార్ ప్రాంతంలో హాథి పొఖారి సమీపాన శనివారం మధ్యాహ్నం ఒకటి, రెండు గంటల ప్రాంతంలో ఇరు గ్రూపులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా పరస్పరం రాళ్లు విసురుకోవడంతో పలువురు గాయపడ్డారు. ఈ ఘటనలో కటక్ డిసిపి ఖిలారి రిషికేశ్ ధ్యాన్‌దేవ్ కూడా గాయపడినట్లు అధికారులు తెలిపారు. దీంతో పోలీసులు లాఠీఛార్జి చేసి అల్లరి మూకలను చెదరగొట్టారు. రహదారి పొడువునా అనేక వాహనాలను అల్లరి మూకలు ధ్వంసం చేశాయి. భద్రతా చర్యల్లో భాగంగా నిమజ్జన కార్యాక్రమాన్ని నిలిపివేశారు. అనంతరం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు మధ్య ఆదివారం ఉదయం నిమజ్జనం కార్యక్రమం ముగిసింది. కాగా ఘర్షణలకు సంబంధించి ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలంతా సంయమనం పాటించి సోదరభావాన్ని పరిరక్షించాలని ముఖ్యమంత్రి మోహన్ మాఝీ కోరారు. అయితే ఈ ఉద్రిక్తతల నేపథ్యంలోనే విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) సోమవారం నాడు ఒక రోజు బంద్ చేపట్టాలని పిలుపునిచ్చింది. శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైన స్థానిక డిసిపిని, జిల్లా కలెక్టరును తక్షణమే బదిలీ చేయాలని విహెచ్‌పి డిమాండ్ చేసింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, సంఘ విద్రోహక మూకలకు హద్దు లేకుండా పోతోందని, అందుకే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని బిజు జనతా దళ్ (బిజెడి) ఆందోళన వ్యక్తం చేసింది.


ధ్వంసమైన వాహనాలు

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనపై సర్వత్రా ఆగ్రహం

- స్థానిక బిజెపి ఎమ్మెల్యేల్లో సైతం అసంతృప్తి
- తక్షణమే తొలగించాలని కేంద్రంపై ఒత్తిడి

న్యూఢిల్లీ : స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం మణిపూర్‌లో ఆదివాసీ తెగల మధ్య హింసాగ్ని రాజేసిన బిజెపి.. ఇప్పుడు నష్టనివారణకు పడరాని పాట్లు పడుతోంది. అనిశ్చితి పేరిట ఇక్కడ విధించిన రాష్ట్రపతి పాలనపై గిరిజన తెగలతో పాటు స్థానిక బిజెపి ఎమ్మెల్యేల్లోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇది ఇలానే కొనసాగితే పట్టుకోల్పోతామనే ఆందోళన స్థానిక బిజెపి నేతల్లో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో తక్షణమే రాష్ట్రపతి పాలన ఎత్తివేయాలని బిజెపి అధినాయకత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ క్రమంలోనే మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను ఎత్తివేసి, కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరేందుకు ఆ రాష్ట్రానికి చెందిన బిజెపి శాసనసభ్యుల బృందం ఆదివారం ఢిల్లీకి చేరుకుంది. ఈ బృందానికి మాజీ ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్ నేతృత్వం వహిస్తున్నారు. గిరిజన తెగల మధ్య ఘర్షణలు చెలరేగడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. గడువు ముగియడంతో పార్లమెంట్ అనుమతితో ఆగస్టులో మరో అరు నెలలు పొడిగించారు. రాష్ట్రం కేంద్ర పాలనలో ఉన్నప్పటికీ శాసనసభను రద్దు చేయకుండా సుప్త చేతనావస్థలో ఉంచారు. దీంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బిజెపి ఎమ్మెల్యేలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఢిల్లీకి వెళ్లే ముందు ఇంఫాల్ విమానాశ్రయంలో మాజీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ మీడియాతో మాట్లాడారు. బిజెపి కేంద్ర నాయకత్వంతో సమావేశమై మణిపూర్‌లో సాధ్యమైనంత త్వరగా కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరతామని చెప్పారు. నిరాశ్రయులైన స్థానిక ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై కూడా చర్చిస్తామన్నారు.

శాంతి ప్రణాళికపై నేడు త్రైపాక్షిక చర్చలు

- కైరో చేరుకుంటున్న హమాస్, ఇజ్రాయిల్, అమెరికా ప్రతినిధులు

వాషింగ్టన్ : గాజాలో కాల్పుల విరమణకు సంబంధించి ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు హమాస్, ఇజ్రాయిల్, అమెరికా ప్రతినిధి బృందాలు ఈజిప్ట్ రాజధాని కైరోకు చేరుకుంటున్నాయి. త్రైపాక్షిక ప్రతినిధి బృందాల మధ్య సోమవారం చర్చలు మొదలయ్యే అవకాశం ఉంది. ప్రణాళికలోని అన్ని నిబంధనలకు హమాస్ అంగీకరిస్తుందా, ఇజ్రాయిల్ భద్రతా సమస్యలను ఎలా పరిష్కరిస్తారు అనే అంశాలపై ఇంకా స్పష్టత రావడం లేదు. గాజా నుంచి దళాలను పూర్తిగా ఉపసంహరించుకోవడం జరగదని ఇజ్రాయిల్ స్పష్టం చేసింది. మరోవైపు గాజా ప్రణాళికకు ఆమోదం తెలపాల్సిందిగా ఇజ్రాయిల్, హమాస్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒత్తిడి పెంచుతున్నారు. సుమారు రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు రెండు పక్షాలు ఇప్పటికే అంగీకరించిన విషయం తెలిసిందే. గాజా నుంచి తన దళాల ఉపసంహరణను ప్రారంభించేందుకు ఇజ్రాయిల్ అంగీకరించిందని, హమాస్ కూడా అంగీకారం తెలిపితే కాల్పుల విరమణ తక్షణమే అమలులోకి వస్తుందని, బందీల విడుదల కూడా జరుగుతుందని ట్రంప్ తెలిపారు. ఈ పరిణామాల అనంతరం దళాల ఉపసంహరణ రెండో దశకు విధివిధానాలను నిర్ణయిస్తామని చెప్పారు.

ఆగని ఇజ్రాయిల్ దాడులు

గాజాపై బాంబు దాడిని తాత్కాలికంగా నిలిపివేసేందుకు ఇజ్రాయిల్ అంగీకరించిందని ట్రంప్ చెప్పినప్పటికీ శనివారం గాజా స్ట్రిప్‌లో జరిగిన దాడుల్లో 67 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్క గాజా నగరంలోనే 45 మంది చనిపోయారు. శాంతి ప్రణాళికకు ఆమోదం తెలపడంలో హమాస్ జాప్యం చేస్తే తాను సహించబోనని ట్రంప్ హెచ్చరించారు. యుద్ధానికి స్వస్తి చెప్పాలని, ఆయుధాలు విడిచిపెట్టాల్సిందేనని స్పష్టం చేశారు. శాంతి ప్రణాళికపై హమాస్ స్పందన వెలువడిన తర్వాత ఆయన ఈ హెచ్చరిక చేయడం గమనార్హం. ప్రణాళికలోని కొన్ని అంశాలపై మరింతగా చర్చలు జరగాల్సిన అవసరమున్నదని హమాస్ అభిప్రాయపడిన విషయం తెలిసిందే. కాగా రాబోయే రోజులలో బందీలందరూ విడుదల అవుతారని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇప్పటికే విఫలమైన రెండు ఒప్పందాలు

యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 17 వేల మంది చిన్నారులు సహా 67 మందికి పైగా పాలస్తీనియన్లు చనిపోయారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై హమాస్ జరిపిన దాడితో ఘర్షణలు మొదలయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకూ రెండు సార్లు మాత్రమే కాల్పుల విరమణను పాటించారు. 2023 నవంబరులో మొదటిసారిగా కాల్పుల విరమణ జరిగినప్పటికీ అది వారం రోజులు మాత్రమే కొనసాగింది. ఈ సంవత్సరం జనవరి తర్వాత రెండోసారి కాల్పుల విరమణ అమలులోకి వచ్చినప్పటికీ అది కూడా విఫలమైంది. కాగా ట్రంప్ ప్రతిపాదించిన తాజా శాంతి ప్రణాళికకు హమాస్ అంగీకరించడాన్ని ఖతార్, ఈజిప్ట్, యుఎఇ స్వాగతించాయి.


ఇజ్రాయిల్ మారణకాండను నిరసిస్తూ రోమ్‌లో ఆందోళన చేస్తున్న ప్రజలు

కెజిహెచ్‌కు మరో 13 మంది విద్యార్థినుల తరలింపు


కెజిహెచ్‌లో విద్యార్థినిని పరామర్శిస్తున్న మంత్రి సంధ్యారాణి

(మొదటిపేజి తరువాయి)

గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి ఎం.గౌతమి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. జరిగిన సంఘటనపై ప్రత్యేక బృందాన్ని నియమించామని, సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. పాఠశాలలో కొత్త ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, మరికొన్ని నెలల పాటు పూర్తి జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి విద్యార్థినినీ క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది పర్యవేక్షించారని, ఎటువంటి సంఘటనలూ జరగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా వారం రోజుల పాటు ఈ పాఠశాలకు ప్రత్యేక సెలవులు ప్రకటించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకరరెడ్డి తెలిపారు.

ముఖ్యమంత్రి ఆరా

కురుపాం గురుకుల పాఠశాల, అనంతపురం శిశు సంరక్షణ కేంద్రం ఘటనలపై రాష్ట్ర గిరిజన సంక్షేమం, మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం మాట్లాడారు. కురుపాం గురుకుల పాఠశాలలో పదుల సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురైన దృష్ట్యా సంబంధిత అధికారులపై తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతపురంలోని శిశుసంరక్షణ కేంద్రంలో పసిబిడ్డ మృతిపైనా సిఎం ఆరా తీశారు.

మెరుగైన వైద్య సేవలు : మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదివారం సాయంత్రం పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య సేవలందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణిని ఆదేశించారు. తొలుత మంత్రి ఐసోలేషన్, రాజేంద్రప్రసాద్ వార్డు, పిల్లల వార్డుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం మీడియాకు పలు విషయాలు వెల్లడించారు. విద్యార్థినులు పచ్చకామెర్లు, జ్వరంతో బాధపడుతున్నారని తెలిపారు. బాలికలు అస్వస్థతకు గురికావడంపై విచారణ చేస్తున్నామని, ఎవరి తప్పిదమైనా ఉంటే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థినుల మృతి బాధాకరం : పవన్ కల్యాణ్

కురుపాం బాలికల గురుకులం విద్యార్థినుల మృతి బాధాకరమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన చికిత్స అందించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటోందని తెలిపారు. త్వరలో కురుపాం వెళ్లి గురుకులంలో పరిస్థితిని పరిశీలిస్తానని పేర్కొన్నారు.


విద్యార్థినిని పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వమే బాధ్యత వహించాలి : ఎస్ఎఫ్ఐ

కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్, విశాఖ జిల్లా అధ్యక్షులు జి.అజయ్, ఉపాధ్యక్షులు సాయి తేజ తదితరులు పరామర్శించారు. ఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. నెల రోజుల క్రితం పార్వతీపురం మన్యం కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లోని సమస్యలను అధికార యంత్రాంగానికి తాము తెలియజేసినా పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని రామ్మోహన్ అన్నారు.

కొద్ది రోజుల క్రితం పచ్చకామెర్లతో చనిపోయిన ఇద్దరు విద్యార్థినుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియోను ప్రభుత్వం ప్రకటించాలని, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి మంచి వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : ఐద్వా

గురుకుల విద్యార్థినుల అస్వస్థతపై సమగ్ర విచారణ జరిపి మరణాలకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, అన్ని గురుకుల పాఠశాలల్లో వసతులు మెరుగుపరచాలని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కురుపాం మండలంలో ని గిరిజన గురుకుల పాఠశాలలో చోటుచే సుకున్న ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇద్దరు విద్యార్థినులు మృతి చెందడం, నీటి కాలుష్యం గురించి విద్యార్థినులు కొద్ది రోజులుగా ఫిర్యాదు చేసినా అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ దారుణ పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అన్ని గురుకుల పాఠశాలల్లో తాగునీటి నాణ్యత, ఆహార సరఫరా, వసతి గృహాల పరిశుభ్రతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరారు.

డార్జిలింగ్‌లో పెను విషాదం

(మొదటిపేజీ తరువాయి)

డార్జిలింగ్‌లో ఎక్కడివారక్కడే చిక్కుకుపోయారు. అలాగే, అనేక గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. మరోవైపు, సోమవారం కూడా డార్జిలింగ్, కలింపాంగ్‌తో సహా పశ్చిమ బెంగాల్ అనేక ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.

మిరిక్ హిల్స్, డార్జిలింగ్ హిల్స్‌లో ఆదివారం కొండచరియలు విరిగిపడ్డాయి. సర్సాలీ, జస్బిర్గాం, మిరిక్ బస్తీ, ధార్ గాన్ (మేచి), నాగరకట, మిరిక్ లేక్ ఏరియా వంటి ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడగా, మిరిక్ హిల్స్ తీవ్రంగా ప్రభావితమయింది. ఇక్కడ 11 మంది మరణించగా, ఏడుగుర్ని రక్షించారు. అలాగే డార్జిలింగ్ హిల్స్‌లో 12 మంది మరణించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకుని సహాయక కార్యక్రమాలు ప్రారంభించాయి. ఈ మహా విపత్తు సమయంలో ప్రతిపక్ష సిపిఎంకు చెందిన రెడ్ వాలంటర్లు బాధితులకు అండగా నిలుస్తున్నారు. సహాయక చర్యల్లో నిమగ్నమవ్వడమే కాకుండా ప్రత్యేకంగా కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి అన్నివిధాలా సహాయం అందిస్తున్నారు. నాగరకటలోని ధార్‌గావ్‌లో శిథిలాల నుంచి దాదాపు 40 మందిని రక్షించారు. ఇక్కడ అనేక నివాసాలు వర్షాలకు నేలమట్టమయ్యాయి. రాష్ట్ర మంత్రి ఉదయన్ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో మిరిక్-సుఖియాపోఖ్రి రహదారితో సహా అనేక కీలక మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కమ్యూనికేషన్ లైన్లు తెగిపోయాయి.

ప్రధాని విచారం

బెంగాల్‌లో కొండచరియలు విరిగిపడి అనేక మంది చనిపోవడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తదితరులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాగా ప్రభావిత ప్రాంతాలకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం వెళ్లి పరిశీలించనున్నారు. భూటాన్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్రంలోని ఉత్తర ప్రాంతంలోకి వరద నీరు పోటెత్తిందని మమత బెనర్జీ అన్నారు.

జాతీయ మహా విపత్తుగా ప్రకటించాలి : సిపిఎం

డార్జిలింగ్‌లో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడిన ప్రమాదాన్ని జాతీయ మహా విపత్తుగా ప్రకటించాలని సిపిఎం డిమాండ్ చేసింది. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం, తగిన పరిహారం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. డార్జిలింగ్, పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయని, దీని వలన అనేక మంత్రి ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది నిరాశ్రయులయ్యారని, అలాగే ఈ ప్రమాదంలో యావత్తు గ్రామాలు, రోడ్లు కూడా కొట్టుకునిపోయాయని ప్రకటనలో తెలిపింది. బాధిత కుటుంబాలకు తీవ్ర సానుభూతిని, సంఘీభావాన్ని సిపిఎం ప్రకటించింది. ఈ మహా విపత్తు సమయాన ప్రజలందరూ బాధితులకు అండగా నిలువాలని సిపిఎం ప్రధానకార్యదర్శి ఎంఎ బేబీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఆపద సమయంలో బాధితులకు సంఘీభావం, మద్దతు అందించాలని కోరారు. ప్రమాదం వలన జరిగిన ప్రాణనష్టం, భారీ విధ్వంసం పట్ల తీవ్ర విచారాన్ని ఎంఎ బేబి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ట్రంప్ సుంకాలపై నిరంతర పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

జరిగితే రాష్ట్రంలో మొక్కజొన్న, పాడి, వ్యవసాయ ఉత్పత్తులు చేసే రైతులందరికీ తీవ్రమైన నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి, జనసేన పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసిపి కనీసం ఉలుకుపలుకూ లేకుండా ఉండడం సరికాదన్నారు. బిజెపి అడగకుండానే మద్దతిచ్చే జగన్ ఈ విషయంలోనైనా స్పందించాలని డిమాండ్ చేశారు.

అదే నయవంచన, అదే కపటత్వం

(మొదటిపేజీ తరువాయి)

లేదన్నారు. సామాన్యుడికి ఈ మాటలేవీ అర్థం కావు. కాని మోహన్ భగవత్ లక్ష్యంగా చేసుకున్నది దేనినో స్పష్టంగా కనిపిస్తూనేవుంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశాబ్దాలలో స్వావలంబన సాధన దిశగా చేపట్టిన ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానాలను అతడు తప్పుపడుతున్నాడు. ప్రభుత్వ రంగం బలపడడాన్ని, బ్యాంకుల జాతీయాకరణను, వ్యవసాయరంగంలో ఆధించిన హరిత విప్లవాన్ని, సహకార వ్యవస్థను, అన్నింటినీ కట్టగట్టి అదంతా తప్పుడు మార్గం అని ఒక్క మాటలో మోహన్ భగవత్ తేల్చేశారు.

అంటే మనం సాధించుకున్న పరిమితమైన ఆర్థిక, వ్యవసాయిక స్వావలంబనను కూడా పూర్తిగా వదులకుని, విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు దాసోహం కావాలన్నమాట! ప్రజల సంపదను వారికి కట్టబెట్టే ప్రక్రియ చివరిదాకా కొనసాగాలన్నమాట! ఇదే మోహన్ భగవత్ గారి ఆత్మనిర్భరత! అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలను త.చ. తప్పకుండా పాటిస్తూ, ట్రంప్ అడుగులకు మడుగులత్తుతూపోతే ఆత్మనిర్భరత వస్తుందా ? శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల పరిణామాలను ప్రస్తావిస్తూ, అటువంటి తిరుగుబాట్లు ఏ పరిష్కారాన్నీ సాధించజాలవని తేల్చేశారు. ఆ దేశాల్లో జరిగిన పరిణామాలు మంచి సూచనలు కావంటూ, విదేశీ శక్తులు జోక్యం చేసుకుని అల్లకల్లోలం సృష్టించడానికి అవి అవకాశాన్ని ఇస్తాయన్నారు. ఇరుగు పొరుగు దేశాల పరిణామాలు ఆరెస్సెస్ అధినేత గుండెల్లో గుబులు పుట్టించినట్టు కనిపిస్తోంది. అందుకేనేమో మోడీ ప్రభుత్వం ప్రజల మనోభావాలను మరింత సన్నిహితంగా పరిశీలించి వ్యవహరించాలని సలహా ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాలని పదే పదే తన ప్రసంగంలో మోహన్ భగవత్ చెప్పారు. ఇప్పుడు మన దేశంలో ఆ ప్రజాస్వామ్య వ్యవస్థకు, రాజ్యాంగానికి ముప్పు ఎవరినుంచి వస్తోంది? వోటర్ల జాబితా నుండి లక్షల సంఖ్యలో పేర్లు మాయం అవుతున్నాయెందుకు? ఇడి, సిబిఐ, ఐటి, ఎన్నికల కమిషన్, మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, గవర్నర్లు రాజ్యాంగ విలువలకు పూర్తి విరుద్ధంగా ఎందుకు వ్యవహరిస్తున్నారు? ఇదంతా తమ ఆశీర్వాదమే కదా భగవత్‌జీ? గోగూండాల దాడులు, బుల్డోజర్ రాజకీయాలు తమరి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమేనా? ప్రజలెన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలమీద కక్ష గట్టి గవర్నర్లు చెలాయిస్తున్నది ప్రజాస్వామ్యమేనా?

గతంలో మోహన్ భగవత్ చేసిన ప్రసంగాలలో కాశీ, మధుర వంటి వివాదాలను, " వాళ్ళు- మనం" అంటూ భిన్న మతాల విశ్వాసుల మధ్య విభేదాలను రెచ్చగొట్టే ప్రస్తావనలు ఉండేవి. ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని కాబోలు ఈ సారి రాగం కాస్త మార్చారు. "వాళ్ళు-మనం" అన్న ప్రస్తావనలు వద్దన్నారు. అలా అంటూనే శతాబ్దాలక్రితం భారతదేశం విదేశీ దురాక్రమణలకు గురయిందని, ఆ "దురాక్రమణదారుల" ద్వారా ప్రవేశించిన విశ్వాసాలనే అంటిపెట్టుకుని ఇంకా కొంతమంది ఈ దేశంలో కొనసాగుతున్నారని పరోక్షంగా విద్వేషభావనలను వెలిబుచ్చారు.

ఆరెస్సెస్ వైఖరిలో మార్పు వచ్చిందని ఎవరైనా అనుకుంటారేమోనని అనుమానం వచ్చి "వందేళ్ళ క్రితం ఆరెస్సెస్ ఏ సిద్ధాంతంతో ఉందో ఇప్పుడూ అదే మా సిద్ధాంతం" అని మోహన్ భగవత్ స్పష్టం చేసినట్లువుంది. "హిందూ రాష్ట్ర", హిందూ సంస్కృతి" ప్రాతిపదికన మాత్రమే దేశాన్ని ఐక్యంగా ఉంచగలమని ప్రకటించారు. ఆరెస్సెస్ హిందూత్వ భావజాలాన్ని తగ్గట్టుగానే మోహన్ భగవత్ ప్రసంగంలో ఎక్కడా మహిళల ప్రస్తావన గాని, పెరుగుతున్న అత్యాచారాల పట్ల ఆందోళన కాని లేదు. దళితుల మీద, గిరిజనులమీద పెరుగుతున్న దాడులు, వారి పట్ల సాగుతున్న దురాగతాల గురించి ఒక్క మాట కూడా లేదు. సామాజిక న్యాయం అన్న పదం ఎక్కడా లేదు.

అన్నట్టు మోహన్ భగవత్ ప్రసంగంలో ఎక్కడా మోడీ పేరును ప్రస్తావించలేదు. చెప్పకనే చెప్పడం అంటే ఇదే మరి.

జీవన సౌరభం

చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే, చెయ్యాలనే కోరిక, సంకల్పం ఉన్నవాడు ఎక్కువ చెయ్యగలడు.

మీ కోసం

ఒక కప్పు ఉసిరి పొడి, రెండు కప్పుల పెరుగు కలిపి రాత్రంతా నాననిచ్చి, మరుసటి రోజు తలకు పట్టించి, ఒక గంట తర్వాత కడిగేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే తెల్లజుట్టు నల్లబడుతుంది.



ఎలుక బొరియ



కోరుట్లపేట గ్రామంలో రమేష్ – రాణి అనే రైతు దంపతులు ఉన్నారు. వీరిది వ్యవసాయ కుటుంబం. రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వీరికి వివేక్ అనే కొడుకు ఉన్నాడు. తను నాలుగవ తరగతి చదువుతున్నాడు. చాలా తెలివి కలవాడు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు వెళతాడు. మాస్టార్లు చెప్పిన పాఠాలు చక్కగా వింటాడు. మిత్రులతో కలిసి మెలిసి ఉంటాడు. అందరూ అతన్ని మెచ్చుకుంటారు. ఇంటిదగ్గర పిల్లలతో రకరకాల ఆటలాడతాడు. మట్టి బొమ్మలు తయారు చేస్తాడు. కంప్యూటర్లో, చేతితో చక్కని బొమ్మలు గీస్తాడు. వివేక్ అమ్మకు ఇంటి పనుల్లో, నాన్నకు పొలం పనుల్లో సాయం చేస్తాడు.

ఒకసారి వివేక్ వాళ్ల పొలంలో ఎన్ని నీళ్లు పెట్టినా ఎలుకలు బొరియలతో అవి వృథా అవుతున్నాయి. రమేష్ ఎన్నిసార్లు బొరియల్లో మట్టి నింపినా తెల్లారి వచ్చి చూస్తే రంధ్రాలు పడి ఉంటున్నాయి. చేను ఎండిపోతుంది. ఏంచేయాలో తోచక రమేష్ చాలా బాధపడ్డాడు.

అప్పుడు తండ్రి బాధ చూసిన వివేక్ ఓ ఆలోచన చేశాడు. 'నాన్నా నువ్వు ఒడ్లకు ఉన్న ఎలుకల నివాసాలు మూసేసావు. అందుకే అవి పదే పదే బయటకు వస్తున్నాయి. నీళ్లు పోతున్నాయి. అయితే ఎలుకలు బయటకు వచ్చినా నీళ్లు కిందికి పోకుండా చేద్దాం. రంధ్రాలు మూయకుండా పక్కనే ఎత్తుగా (చిన్న ఒడ్లు) సాయలు పెడదాం' అని చెప్పాడు. రమేష్, వివేక్ ఆ రోజు పొద్దు పోయేదాకా పొలంలో సాయలు పెట్టారు. తెల్లవారి పొలంలోకి వచ్చారు. ఎలుక బొరియలు తెరిచే ఉన్నాయి. అయినా చేను నిండా నీళ్లు ఉన్నాయి. వివేక్ ఉపాయం విజయవంతమైనందుకు రమేష్ ఎంతో సంతోషించాడు.

– డా.వాసరవేణి పర్శరాములు,
బాల సాహిత్య రచయిత,
94921 93437.

నేను గీసిన బొమ్మ



పి.జీవనజ్యోతి,
3వ తరగతి,
ఎంపియుపి స్కూలు,
పి.నైనవరం,
ఎన్టీఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఈ అక్కాచెల్లెళ్లు బ్యాడ్మింటన్‌లో భేష్ ..!





పట్టుదల..
ఆత్మ విశ్వాసం, ధైర్యం తోడుగా ఉంటే దేనినైనా సాధించగలమనే నమ్మకంతో ఈ అక్కాచెల్లెళ్లు ముందుకు సాగుతున్నారు. అంతర్జాతీయ క్రీడల్లో రాణించి దేశానికి పతకం సాధించాలన్నది వారి స్వప్నం. వారే దేవనబోయిన స్రవంతి, దీపిక. జాతీయ స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తూ, దేశానికి మరిన్ని పతకాలు సాధించటానికి శ్రమిస్తున్నారు.

గుంటూరు జిల్లా గురజాల మండలం దైదా గ్రామానికి చెందిన దేవనబోయిన వెంకటేశ్వరరావు, మల్లేశ్వరిల కుమార్తెలు స్రవంతి, దీపిక. వీరిద్దరూ ఓ వైపు క్రీడల్లో రాణిస్తూనే మరోవైపు చదువు కొనసాగిస్తున్నారు. స్రవంతి డిగ్రీ బిఎ మొదటి సంవత్సరం ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా ప్రయివేటుగా చదువుతోంది. దీపిక గురజాలలోని నవోదయ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి ఆర్టీసీలో కాంట్రాక్టు ఉద్యోగి. వచ్చే జీతం కుటుంబ పోషణకే సరిపోకపోవటంతో కూలి పనులకు సైతం వెళ్తుంటారు. కుమార్తెల ఆసక్తి మేరకు షటిల్ బ్యాడ్మింటెన్ క్రీడలో ప్రోత్సహించారు. తండ్రి ప్రోత్సాహంతో అక్కాచెల్లెళ్లు ఇద్దరూ ఎంతో శ్రద్ధతో ఆ క్రీడలో రాణిస్తున్నారు. ఇప్పటికే పలు రాష్ట్ర, అంతరాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలను సాధించారు.

డబుల్స్ షటిల్‌లో జయకేతనం

స్రవంతి, దీపిక ఇద్దరూ ఆటలో మంచి నైపుణ్యం ప్రదర్శిస్తారు. ఇద్దరూ పరస్పరం సహకరించుకుంటూ వచ్చే షటిల్స్‌ను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. సర్వీస్ చేయటంలో చాకచక్యాన్ని ప్రదర్శిస్తారు. గ్రౌండ్‌లో దిగాక బ్యాట్‌ను వేగంగా ఝుళిపించటం, లక్ష్యాన్ని చేధించేలా పవర్ పంచ్‌లు ఇవ్వటం, కోర్టులో ఏ వైపుకు వెళ్తే ప్రత్యర్థులు ఆ లక్ష్యాన్ని చేధించరో అలా గురిచేసి బ్యాట్‌ను హిట్ చేయడం ... వంటి మెళకువలు పాటిస్తూ రాణిస్తున్నారు.

చిన్నప్పటి నుంచే ఆటలపై ఆసక్తి...

స్రవంతి, దీపిక చిన్నప్పటి నుంచి చదువుతోపాటుగా ఆటలపైనా శ్రద్ధ చూపేవారు. ప్రాథమిక స్థాయిలో చదివిన పాఠశాలల్లో జరిగే అన్ని క్రీడాంశాల్లోనూ పాల్గొనే వారు. షటిల్ బ్యాడ్మింటన్‌పై కాస్త ఎక్కువ ఆసక్తి ఉండేది. ఆ ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు వారి కోరిక మేరకు ఆ క్రీడలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు.

వీరు ప్రస్తుతం తాడేపల్లిలోని ప్రో షటిలర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. వీరికి కిరణ్, రాజేష్ శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు కిరణ్ ఆర్థిక సహాయం కూడా చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా ఏమాత్రం వెనుకంజ వేయకుండా ఆటలో మున్ముందుకు సాగుతున్నారు స్రవంతి, దీపిక. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న ఈ అక్కాచెల్లెళ్లు ఒలింపిక్స్‌కి వెళ్లి, పతకం సాధించాలని తమ ధ్యేయమని చెబుతున్నారు. ప్రస్తుతం వీరు జాతీయస్థాయిలో అండర్ –19 విభాగంలో ఆరోస్థానంలో ఉన్నారు. మరింత పటిష్టమైన కృషితో రాబోయేరోజుల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచేలా కఠోర దీక్షతో కృషిస్తున్నారు.

అత్యధిక ఫిట్‌నెస్ అవసరమున్న ఆటల్లో బ్యాడ్మింటన్ ముందు వరుసలో ఉంటుంది. సగటున గంట పాటు సాగే మ్యాచ్‌లకు ఎంతో ఫిట్‌నెస్ అవసరం. దీనికోసం శారీరక వ్యాయామాలతోపాటు మంచి పౌష్టికాహారం తీసుకోవాలి. దీనికోసం ఆర్థిక తోడ్పాటు అవసరం. రాష్ట్రప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తే వీరు క్రీడల్లో మరింతగా రాణించేందుకు అవకాశం ఉంటుంది.

– యడవల్లి శ్రీనివాసరావు

సాధించిన పతకాలు ఇవే...

- అండర్–17 రాష్ట్ర జూనియర్ బ్యాడ్మింటెన్ చాంఫియన్‌షిప్–2023 (డబుల్స్ విన్నర్స్)
- అండర్–17 రాష్ట్ర జూనియర్ బ్యాడ్మింటెన్ చాంఫియన్‌షిప్–2022 (డబుల్స్ రన్నర్స్)
- ఎనెక్స్ సన్‌రైజ్ సౌత్‌జోన్ టీమ్ ఈవెంట్–2023 (విన్నర్స్)
- రాష్ట్రస్థాయి సీనియర్ బ్యాడ్మింటెన్ చాంఫియన్‌షిఫ్ –2023 (మెన్ అండ్ ఉమెన్) (డబుల్స్ విన్నర్)
- ఎపి సిఎం ఫ్రైజ్ మనీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ (జోనల్ లెవల్) –2022 (మెన్ అండ్ ఉమెన్) (డబుల్స్ విన్నర్స్)
- అండర్–17 రెండో రాష్ట్రసబ్ జూనియర్ ర్యాకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ –2019 (డబుల్స్ రన్నర్స్)
- 37వ నేషనల్ గేమ్స్ –2023 (గోవా–బ్రాంజ్‌మెడల్ టీమ్‌ఈవెంట్)

పతకమే లక్ష్యంగా ...

రాష్ట్రస్థాయిలో సింగిల్స్, డబుల్స్‌లోనే అనేక పతకాలు సాధించాం. జాతీయస్థాయిలో రాణిస్తున్నాం. మరింత నిపుణతతో ముందుకు సాగుతున్నాం. రాబోయే రోజుల్లో మరింత ప్రాక్టీస్ చేయటం ద్వారా దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. కిరణ్, రాజేష్ సార్‌లు ఆటలో మెళకువలు నేర్పిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఆడి దేశానికి పతకం తీసుకురావాలన్నది మా ఆశ.

– దేవనబోయిన స్రవంతి, దీపిక

విడుదల రోజే పైరసీ గ్రహణం!

టాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకూ... కోలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకూ ఏ సినిమా పరిశ్రమను చూసినా 'పైరసీ' భూతం వెంటాడుతోంది. అధునాతన టెక్నాలజీ సంగతి పక్కన పెడితే మొబైల్ సెల్ నుంచి తీసిన పైరసీ వీడియోలు యావత్ సినిమా పరిశ్రమను హడలెత్తిస్తున్నాయి. ఈ ఏడాది పైరసీలో వచ్చిన కొత్త రూపం హెడ్‌డి ప్రింట్ కాపీలు ఆన్‌లైన్‌లో ఎంచక్కా చక్కర్లు కొట్టేస్తున్నాయి. సర్వర్ హ్యాకింగ్‌తో పాటు క్యామ్ కార్డర్ ద్వారా నిందితులు సినిమాలను పైరసీ చేస్తున్నారు. బెట్టింగ్ గేమింగ్ యాప్స్ నిర్వాహకులు పైరసీ చేసే వాళ్లకు డబ్బులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. ఆయా నిర్వాహకులు పైరసీ మూవీల ద్వారా తన యాప్‌లను ప్రచారం చేసుకుంటున్నారు.



దేశంలోని మిగతా ఇండస్ట్రీలతో పోల్చితే ఎక్కువ పైరసీ నడుస్తోంది టాలీవుడ్‌లోనే. రిలీజ్ అయిన మొదటిరోజై హై క్వాలిటీతో ఆన్‌లైన్‌లో మూవీస్ లింక్స్ వచ్చేస్తున్నాయి. సోషల్ మీడియాలో నిముషాల్లోనే వైరల్ అవుతుండటంతో అందరూ గుట్టుచప్పుడు కాకుండా ఎంచక్కా డౌన్‌లోడ్ చేసేసుకుని చూసేస్తున్నారు. గతంలో భయం భయంగా ఇళ్లల్లో చూసేవారు. ఇప్పుడు ప్రయాణాల్లో సైతం బ్లూటూత్ ఉపయోగిస్తూ వీక్షిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకూ విడుదలైన ప్రతి సినిమా అదేరోజూ పైరసీలో వచ్చేశాయంటే ఆశ్చర్యం కలుగకమానదు. ఇందులో హిట్టయిన సినిమాలు, పరాజయం పొందినవి కూడా ఉన్నాయి. అయితే నష్టపోయింది మాత్రం నిర్మాతలు, పెట్టుబడి పెట్టిన వారు. పైరసీదారులు మాత్రం కోట్లు గడించిన ఉదంతాలు ఇటీవల కాలంలో చాలా వెలుగులోకి వచ్చాయి.

క్రిప్టో కరెన్సీ ద్వారా లావాదేవీలు

తాజాగా తెలంగాణా సైబర్ క్రైమ్ పోలీసుల చొరవతో దేశంలోనే అతి పెద్ద పైరసీ నెట్‌వర్క్ భాగోతం వెలుగులోకి వచ్చింది. నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయటంతో పాటుగా ఆరుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. పైరసీ ముఠా సభ్యులు తెలుగు, హిందీ, తమిళం సహా అనేక భాషల సినిమాలను రిలీజ్ అయిన రోజే థియేటర్లలో రికార్డు చేసి అమ్ముతున్నట్లు గుర్తించారు. క్రిప్టో కరెన్సీ ద్వారా లావాదేవీలు జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు ఈ పైరసీ వల్ల ఇండస్ట్రీకి దేశంలో ఏడాదికి దాదాపు రూ.22 వేల కోట్ల నష్టం జరిగినట్లుగా ధృవీకరించారు.

పైరసీ జరిగేది ఇలా...


హైదరాబాద్‌కు చెందిన జానా కిరణ్‌కుమార్ అత్తాపూర్‌లోని మంత్ర థియేటర్‌లో సింగిల్ అనే మూవీని మొబైల్‌లో రికార్డుచేసి సిరిల్ అనే వ్యక్తికి అందజేశాడు. ఇలా 40 సినిమాలు థియేటర్‌లో కాపీ చేశాడు. 150 నుంచి 500 డాలర్లు ప్రతి మూవీ కాపీ చేసినందుకు పొందాడు. సూటబుల్ సీటు చూసుకుని టికెట్ బుక్ చేసుకుని హై అండ్ కెమెరా ఉన్న ఫోన్‌తో రికార్డు చేస్తారు. స్క్రీన్ ఆఫ్ ఉన్నా కెమెరాల్లో వీడియో రికార్డుచేసే యాప్ ద్వారా ఇదంతా చేస్తున్నారు. అర్సలన్ అహ్మద్ బీహార్‌కు చెందిన వ్యక్తి. ఇతను హిందీ జోజ్‌పురి సినిమాలు రికార్డు చేసి సిరల్‌కు పంపుతున్నాడు. నాలుగు వెబ్‌సైట్లు నడుపుతున్న కరూర్‌కు చెందిన సిరిల్ ప్రధాన నిందితుడుగా తెలంగాణా పోలీసుల విచారణలో వెల్లడైంది. కంప్యూటర్ సైన్స్ చదివిన అతడు ఈజీమనీ కోసం ఈ మార్గాన్ని ఎంచుకున్నాడని తేలింది. ఏజెంట్లను నియమించుకుని అన్ని భాషల సినిమాలను ఇతడు పైరసీ చేయిస్తున్నాడు. ఈటీవీ విన్ కంటెంట్‌ను పైరసీ చేసి అమ్ముకున్న మరో నిందితుడిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. రికార్డు చేసిన కంటెంట్ ఇతర వెబ్‌సైట్లకు పైరసీ ముఠా విక్రయిస్తోంది. ఓటీటీ కంటెంట్లను ఐబొమ్మ సహా పలు ప్లాట్‌ఫామ్‌లకు అమ్ముతోంది. ఐబొమ్మ పాత్రపై పోలీసులు లోతైన దర్యాప్తు జరపగా ఆ వెబ్‌సైట్ కోసం పనిచేసే నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బీహార్, ఉత్తరప్రదేశ్‌లో ఐబొమ్మకు ఏజెంట్లు ఉన్నారని తేలింది. కెమెరాలతో థియేటర్‌లో మూవీలను రికార్డుచేసి ప్రింట్స్ విడుదల చేస్తున్న వెబ్‌సైట్స్‌పై దృష్టి పెట్టాలని పోలీసులు భావిస్తున్నారు.

ఎలా షేర్ చేస్తారంటే...

సామాజిక మాధ్యమాలు, మొబైల్ ద్వారా ఈ పైరసీ గ్యాంగ్ చాలా యాక్టింగ్ ఉంటోంది. ముందస్తు పథకం ప్రకారం ముఠా సభ్యులు చాలా కాలంగా సినిమాలను సీక్రెట్‌గా థియేటర్లలో హిడెన్ కెమెరా ద్వారా రికార్డ్ చేసి వాటిని టెలిగ్రామ్, ప్రోటాన్ మెయిల్ వంటి ప్లాట్ ఫామ్స్‌లో అప్‌లోడ్ చేసేస్తారు. అక్కడి నుంచి గుట్టు చప్పుడు కాకుండా సామాజిక సైట్లు, మరికొందరు వ్యాపారులకు వెళ్తాయి.

ఏడాదిన్నరలో 40 సినిమాలు పైరసీ

గత 18 నెలల్లో పైరసీ ముఠా తమ నెట్వర్క్ ద్వారా 40కి పైగా తెలుగు సినిమాలను లీక్ చేశాయి. ఏదైనా సినిమా థియేటర్‌లో రిలీజ్ కాగానే అవి అక్రమ వెబ్‌సైట్లలోకి వచ్చేస్తున్నాయి. ఈ ముఠా అంతర్జాతీయ పైరసీ ప్లాట్ ఫాంలతో '1 తమిళ టివి' వంటి వెబ్‌సైట్లతో కూడా సంబంధం కల్గివుంది. వారి క్రిప్టో వాలెట్ ట్రాన్సాక్షన్స్‌ను ట్రాక్ చేసిన పోలీసులు లొకేషన్ గుర్తించారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ 'యాంటీ వీడియో పైరసీ సెల్'ను గత కొంతకాలంగా కొనసాగిస్తోంది. ఈ సెల్‌కు పలు సినీ నిర్మాతలు, దర్శకులు పైరసీ సినిమాల గురించి ఫిర్యాదులు సమర్పిస్తూనే ఉంటున్నారు. 'హ్యాష్ ట్యాగ్ సింగిల్' సినిమా పైరసీపైనా గతంలో పోలీసులకు ఫిర్యాదు అందింది. దీని ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. జులై 3న వనస్థలిపురానికి చెందిన కిరణ్‌ను అరెస్ట్ చేసి విచారించగా, ఈ ముఠా గుట్టు రట్టయ్యింది. ఈ పైరసీ ముఠా దుబాయ్, నెదర్లాండ్, మయన్మార్‌లో ఉన్నట్లు గుర్తించారు. థియేటర్లలో ప్లే అయ్యే శాటిలైట్ కంటెంట్ ఐడీ, పాస్‌వర్డ్‌లను క్రాక్ చేసి... ఏజెంట్లకు రికార్డ్ కెమెరాలు అందజేసి రహస్యంగా ఎలా రికార్డ్ చేయాలో ఈ పైరసీ ముఠా నేర్పిస్తుంది. చొక్కా జేబులు, పాప్‌కార్న్ డబ్బా, కోక్ టిన్లలో కెమెరాలు పెట్టి మూవీ షూట్ చేస్తున్నారు. కొత్త సినిమా కూడా మొబైల్‌లో అందుబాట్లోకి రావడంతో చాలామంది థియేటర్లకు వెళ్లటం లేదు. దీనివల్ల నిర్మాతల ఆదాయానికి గండి పడుతోంది. 2023లో దేశంలో సినీ పరిశ్రమ పైరసీతో రూ.22,400 కోట్లు, అందులో తెలుగు ఇండస్ట్రీ రూ.3700 కోట్లు నష్టపోయినట్టు చెబుతున్నారు.



భారత అమ్మాయిల జైత్రయాత్ర

పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం
వన్డే వరల్డ్‌కప్‌లో 5-0తో అజేయ రికార్డు
భారత్ 247/10, పాకిస్తాన్ 159/10



కొలంబో : అమ్మాయిలూ అదరగొట్టారు. పొరుగు దేశం పాకిస్తాన్‌పై అజేయ రికార్డు కొనసాగించారు. పాకిస్తాన్‌పై వరుసగా 12వ మ్యాచ్‌లో విజయభేరి మోగించిన టీమ్ ఇండియా.. ఐసిసి మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో ఐదోసారి జైత్రయాత్ర సాగించింది. ఆదివారం కొలంబోలో జరిగిన వన్డే వరల్డ్‌కప్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై భారత్ 88 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ప్రపంచకప్ గ్రూప్ దశలో భారత్‌కు ఇది వరుసగా రెండో విజయం కాగా.. పాకిస్తాన్‌కు ఇది వరుసగా రెండో పరాజయం.

ఐసీసీ మహిళల 2025 వన్డే వరల్డ్‌కప్‌లో భారత్ జోరు కొనసాగుతుంది. గువహటిలో శ్రీలంకపై సూపర్ విక్టరీ సాధించిన టీమ్ ఇండియా..కొలంబోలో పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. 248 పరుగుల ఛేదనలో పాకిస్తాన్ అమ్మాయిలు 43 ఓవర్లలో 159 పరుగులకే చేతులెత్తేశారు. భారత బౌలర్లు క్రాంతి గౌడ్ (3/20), దీప్తి శర్మ (3/45), స్నేహ్ రానా (2/38)లు వికెట్ల వేటలో విజృంభించారు. పాక్ బ్యాటర్ సిద్రా ఆమిన్ (81, 106 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో ఒంటరి పోరాటం చేసింది. కానీ సహచర బ్యాటర్ల నుంచి సహకారం దక్కలేదు. ఓపెనర్లు మునీబా అలీ (2), సదాఫ్ (6) సహ అలియా రియాజ్ (2), ఫాతిమా సనా (2), సిద్రా నవాజ్ (14)లు తేలిపోయారు. నటాలీ పర్వేజ్ (33, 46 బంతుల్లో 4 ఫోర్లు) మాత్రమే ఆమిన్‌కు కాసింత సహకారం అందించింది. అయినా, ఆ జట్టు 159 పరుగులకే ఆలౌటై 88 పరుగుల తేడాతో దారుణ పరాజయం చవిచూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 247/10 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో ఎవరూ అర్ధ సెంచరీ సాధించలేదు, కానీ బ్యాటర్లూ సమిష్టిగా పరుగులు రాబట్టారు. హర్లీన్ డియోల్ (46, 65 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), జెమీమా రొడ్రిగస్ (32, 37 బంతుల్లో 5 ఫోర్లు), రిచా ఘోష్ (35 నాటౌట్, 20 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), దీప్తి శర్మ (25, 33 బంతుల్లో 1 ఫోర్), స్నేహ్ రానా (20, 33 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. ఓపెనర్లు ప్రతీకా రావల్ (31), స్మృతీ మంధాన (23), హర్మన్‌ప్రీత్ కౌర్ (19) సైతం మెరిశారు. పాకిస్తాన్ బౌలర్లలో డయాన్ బేగ్ (4/69) నాలుగు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకుంది. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో గురువారం విశాఖపట్నంలో దక్షిణాఫ్రికాతో తలపడనుంది.



ఇరానీ విజేత విదర్భ

- 93 పరుగుల తేడాతో ఘన విజయం

నాగ్‌పూర్ (మహారాష్ట్ర) : దేశవాళీ క్రికెట్ సర్క్యూట్‌లో తనదైన సత్తా చాటుతున్న విదర్భ ముచ్చటగా మూడోసారి ఇరానీ కప్ విజేతగా నిలిచింది. నాగ్‌పూర్‌లో జరిగిన ఇరానీ కప్‌లో రెస్టాఫ్ ఇండియాపై 93 పరుగుల తేడాతో విదర్భ ఘన విజయం సాధించింది. 361 పరుగుల ఛేదనలో రెస్టాఫ్ ఇండియా 73.5 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌటైంది. యశ్ ధుల్ (92, 117 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్), మానవ్ సుథర్ (56 నాటౌట్, 113 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), ఇషాన్ కిషన్ (35, 65 బంతుల్లో 3 ఫోర్లు) పోరాడినా.. ఇతర బ్యాటర్లు తేలిపోయారు. విదర్భ పేసర్ హర్ష్ దూబె (4/73), ఆదిత్య ఠాకరే (2/27), యశ్ ఠాకూర్ (2/47) వికెట్ల వేటలో రాణించారు. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 342/10 పరుగులు చేయగా.. రెస్టాఫ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 214/10 పరుగులు చేసింది. విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 232 పరుగులు చేసింది. సెంచరీతో చెలరేగిన విదర్భ బ్యాటర్ అథర్వ తైడె 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68